

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

ఆదివారం 22 ఫిబ్రవరి 2026 | 11 పేజీలు


# బాల్యం మత్తుమయం..



### - పిల్లల చేతుల్లో బీరు బాటిళ్లు...

### - విచ్చలవిడిగా బెల్ట్ షాపులు...

**సూర్య, ముస్తాబాద్**

ఒకప్పుడు పాఠశాల బ్యాగులు,ఆటపాటలతో కిలకిలలాడే వీధుల్లో ఇప్పుడు ఆందోళనకర దృశ్యాలు కనిపిస్తున్నాయి.చిన్నారుల చేతుల్లో బీర్ బాటిళ్లు దర్శనమివ్వడం స్థానికులను కలవరపెడుతోంది.పట్టణంలోని పలు కాలనీల్లో అనధికారికంగా నడుస్తున్న బెల్ట్ షాపులు బాల్యాన్ని మత్తు మయంగా మార్చుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారులు, దేవాలయ సమీపంలో,స్కూళ్ల సమీప ప్రాంతాల్లో బెల్ట్ షాపులు తెరుచుకుని యువతకు సులభంగా మద్యం అందుబాటులోకి తెస్తున్నాయి.సరైన వయస్సు ధృవీకరణ లేకుండానే మద్యం విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల పదో తరగతి,ఇంటర్ చదువుతున్న విద్యార్థులు కూడా మద్యం అలవాటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.

2లో

### 15 ఏళ్ల తర్వాత అనుమానంతో ప్రతీకారం...

# ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ దారుణ హత్య

### -పెళ్లి వేడుకలలో కత్తితో దాడి...

### -అన్న మృతి.... తమ్ముడికి తీవ్ర గాయాలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

సెంటినరీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం మెలుగూరి కొమురయ్య గౌడ్(58) దారుణ హత్యకు గురైయ్యాడు. ఈయనను బేగంపేట గ్రామానికి చెందిన బుర్ర రాజ కొమురయ్య గౌడ్(60) కత్తితో ఛాతిలో పొడిచి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బేగంపేట గ్రామానికి చెందిన మెలుగూరి కొంరయ్య, సుల్తానాబాద్ మండలం నారాయణరావు పల్లెకు చెందిన మెలుగూరి సత్తయ్యలు అన్నదమ్ములు. వీరి దగ్గరి బంధువైన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి బుర్ర రాజకొమురయ్య (60)కి మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. 2011వ సంవత్సరంలో బుర్ర రాజకొమురయ్య కుమారుడు తిరుపతి గుండారం గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన మృతికి కొమురయ్య, సత్తయ్య లే కారణమని అపోహతో వీరిపై రాజకొమురయ్య ఆరోపణలు చేస్తూ చంపుతానని బెదిరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో బేగంపేట కు చెందిన బుర్ర కుమార్ కూతురు వివాహం సెంటినరీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి కొమురయ్య, సత్తయ్యతో పాటు రాజకొమురయ్య రావడం జరిగింది. ఈ క్రమంలో రాజకొమురయ్య తాను (మిగతా 2లో)



# నీటిపారుదలలో నీచుడు..

### - చిన్నారిపై ఇరిగేషన్ అధికారి అసభ్య ప్రవర్తన

### - వేములవాడలో ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన



**సూర్య, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారి పట్లఇరిగేషన్ శాఖకు చెందిన ఓ అధికారి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వేములవాడ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగిన ఈ సంఘటన సభ్య సమాజం తలదించుకునేలా చేసింది. చిన్నారి కేకలు వేయడంతో గమనించిన స్థానికులు సదరు నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆగ్రహించిన స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు (మిగతా 2లో)

# విషాదంలో విధి ఆడిన వింత నాటకం



### - బంధువు అంత్యక్రియలకు వెళ్తూ..

### - అనంత లోకాలకు మామ-అల్లుడు..

**సూర్య తిమ్మాపూర్**

అంత్యక్రియలకు వెళ్లి వద్దామనుకున్న ఆ కుటుంబంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన మామ, అల్లుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో రెండు గ్రామాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. శనివారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి శివారులో(మిగతా 2లో)

### శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

# అత్యంత వైభవంగా నిర్వహించాలి

### - బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### - భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలి

### - అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### - రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**సూర్య ధర్మపురి:**



ఈనెల 27 నుండి మార్చి 11 వరకు 13 రోజులపాటు జరగనున్న ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ధర్మపురి ఓల్డ్ టీటీడీ ధర్మశాలలో ఏర్పాటుచేసిన బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశం లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్‌ల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, (మిగతా 2లో)



# బాల్యం మత్తుమయం...



**సూర్య, ముస్తాబాద్**

“పిల్లలు సాయంత్రం బయటకు వెళ్తే భయం వేస్తోంది.చదువు,క్రీడలపై దృష్టి పెట్టాల్సిన వయస్సులో మద్యం వైపు మళ్లడం బాధాకరం”అని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “అనధికారిక బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత విషమిస్తుంది.పోలీసు,ఎక్సైజ్ శాఖలు ప్రత్యేక దాడులు నిర్వహించి, ప్రభుత్వ అనుమతి లేని మద్యం షాపులను,చిన్నారులకు మద్యం అమ్మకాలను పూర్తిగా అరికట్టాలి” అని డిమాండ్ చేస్తున్నారు.బాల్యం ఆనందంగా,ఆరోగ్యంగా ఎదగాల్సిన సమయంలో మత్తు వలయంలో చిక్కుకుపోవడం సమాజానికి హెచ్చరికగా మారింది. బెల్ట్ షాపుల నియంత్రణ,తల్లిదండ్రుల పర్యవేక్షణ,పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఇవన్నీ కలిసివస్తేనే బాల్యాన్ని మత్తు మయం నుంచి కాపాడగలమని,మధ్య, పేద తరగతి, యువత మద్యం మత్తులో జోగుతూ చిత్తు అవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 21 సంవత్సరాలు నిండిన వారికే మద్యం విక్రయించాలి ఉండగా మండలంలో ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా మైనర్లకు మద్యంను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మధ్యతరగతి కుటుంబాలు మద్యం మత్తులో రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయి.కావున సంబంధిత ఎక్సైజ్ అధికారులు త్వరితగతిన స్పందించి బెల్టు షాపులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## స్థానిక మహిళాలకు ఇబందులు....

**- బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు కుర్ర సావిత్రి**



సాయంత్రం అయ్యే సరికి గ్రామాల్లో యువత, కూలీలు బెల్టు దుకాణాల వద్ద గుమిగూడుతున్నారని, దీనివల్ల కుటుంబాల్లో కలహాలు,ఆర్థిక ఇబ్బందులు పెరుగుతు న్నాయని.కొన్ని చోట్ల పాఠశాలల, దేవాలయాల సమీపంలో కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, అనుమతి ఉన్న దుకాణాల నుంచి సరఫరా అవుతున్న మద్యం రహస్యంగా గ్రామాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని బిఆర్ఎస్ నాయకురాలు కుర్ర సావిత్రి అన్నారు.గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు, అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టాలని,విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపులను ఎత్తివేసి గ్రామాలలో మహిళలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

## బెల్ట్ షాపులతో యువత తప్పుదారి...

**- బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి**



గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహించడం వల్ల యువత మద్యానికి బానిసై తప్పుదారి పట్టే అవకాశం ఉంది. బెల్ట్ షాపులను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలను కట్టడి చేయడంలో ఎక్సైజ్ శాఖ పూర్తిగా విఫలమవుతోంది.

## పట్టుబడితే కఠిన చర్యలు...

**– శ్రీనివాస్,ఎక్సైజ్ సీఐ**

ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులను సూర్య రిపోర్ట్ సంప్రదించగా, మండలంలో మూడు వైన్స్ షాపులకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉందని,మిగిలినవన్నీ బెల్ట్ షాప్ విక్రయాలని,బెల్ట్ షాపులకు ఎటువంటి అనుమతి లేవు. గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించిన,మైనర్లకు మద్యం విక్రయించిన కేసులు నమోదు చేస్తామని,బెల్టు మద్యం విక్రయాలపై ఇప్పటికే దృష్టి పెట్టాం, పట్టుబడితే ఎంత వారైనా సరే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

# శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పాల్గొన్నారు.ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం లో జరిగే బ్రహ్మోత్సవాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సమయం లో భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని అందుకు అధికారులు అంచనా వేసి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొదటగా సంబంధిత జిల్లా స్థాయి అధికారులను బ్రహ్మోత్స వాలకు సంబంధించి గతంలో ఏర్పాట్ల అను భవాలు ప్రస్తుతం చేస్తున్న ఏర్పాట్ల గురించి శాఖ వారిగా అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 13 రోజుల పాటు జరగనున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలం, ఇతర దేవాలయాల అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేశారని వీటితో పాటు ధర్మపురి నియోజకవర్గం అభివృద్ధికి, జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేశారాని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురి క్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, శుద్ధమైన ఆహారం, వైద్యసేవలు, పారిశుధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా తాత్కాలిక వైద్యశిబిరాలు, అంబులెన్స్ సదుపాయాలు 24 గంటలు అందుబాటులో ఉండాలని చెప్పారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యే దర్శన ఏర్పాట్లు చేసి వారికి సౌకర్యవంతమైన వాతావ ణం కల్పించాలని కోరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణను సమర్ధవం తంగా చేపట్టాలని తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో అన్ని శాఖల అధిక ారులు స్థానికంగా అందుబాటులో ఉంటూ ఎటువంటి లోపాలు లేకుండా, ఘటనలు జరుగ కుండా జాగ్రత్తలు తీసుకుని ఉత్సవాలను ఘనంగ ా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ధర్మపురిలో జరిగే శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక వేడుకలని అన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు హాజరవుతారని అనా న్రు. ఈ సంవత్సరం 10% నుండి 20% భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్య ంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చలువ పందిర్లు, టెంట్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. సీసీ కెమెరాల ద్వారా భద్రతా పర్యవేక్షణ పెంచా లని, భక్తుల సౌకర్యార్థం సమాచార కేంద్రం అనౌన్స్మెంట్ సెంటర్ ల ఏర్పాటు చేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని భక్తులకు సహకారం అందించాలని కోరారు. భక్తుల సౌకర్యం, భద్రతలే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సమయం తక్కువగా ఉన్నందున చేపట్టిన పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అవసరం ఉన్న, చేపట్టాల్సిన పనులు రేపటిలోగా గుర్తించి అంచనాలు రూపొందించుకొని మంజూరు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయంతో పాటు అన్ని ఆలయాల్లో, గోదావరి తీరం వెంట, బస్టాండ్ వద్ద, జాతర మైదానం వద్ద 350 మంది పోలీసులను నియమించి 24 గంటల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాతర జరుగుతున్న రోజుల్లో విఐపి రూట్స్, ప్రధాన ఆలయం, గోదావరి నది దారులు, యాత్రికుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరించుట, ప్రత్యేక మహిళా పోలీసు విభాగం (షీ టీమ్స్ ), పట్టణ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాట్లు, పెట్రోలింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందుస్తూ ప్రణాళికలు రచించి ఘనంగా జాతర నిర్వహించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.అలాగే ఈ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం వల్ల రాబోయే 2027 గోదావరి పుష్కరాలకు అనుభవాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అందుకు అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల సూచనలతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని చేయాలని తెలిపారు. అనంతరం సంక్షేమ శాఖ మంత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి గోడపత్రికను ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారూ. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జిల్లా అధికారులు, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం చైర్మన్ జక్కు రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, దేవస్థానం కమిటీ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 15 ఏళ్ల తర్వాత అనుమానంతో ప్రతీకారం...
## ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చుకున్న కత్తితో మొదట సత్తయ్య పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. అక్కడే ఉన్న సత్తయ్య అన్న కొమురయ్య అడ్డుకునే క్రమంలో రాజకొమురయ్య కత్తితో కొమురయ్య ను ఛాతీపై పొడవడం జరిగింది. దీంతో ఆయన మృతి చెందాడు. మృతుడు కొమురయ్య భార్య లక్ష్మి ఫిర్యాదుతో ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసు స్టేషన్ కు కూతవేటు దూరంలో ఈ సంఘటనతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

## నీటిపారుదలలో నీచుడు..

అప్పగించారు.ఈ విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పాఠశాల ఆవరణలో ఇలాంటి ఘటన జరగడంపై ఉపాధ్యాయుల నిర్లక్ష్యాన్ని నిలదీశారు. ఈ క్రమంలో టీచర్లకు, పేరెంట్స్‌కు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. తమ పిల్లలకు రక్షణ కల్పించలేరా అంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వేములవాడ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడు ఇరిగేషన్ శాఖలో బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి నీచానికి ఒడిగట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని పట్ల ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## విషాదంలో విధి ఆడిన వింత నాటకం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను కలచివేసింది. మానకొండూరు మండలం కొండపల్కల గ్రామానికి చెందిన శ్రీరాముల రామచంద్రం, తన సొంత అల్లుడు, హుస్నాబాద్‌కు చెందిన అవదుర్తి శ్రీనివాస్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లిలో రామచంద్రం మరదలు మరణించడంతో, ఆమె అంత్యక్రియలకు హాజరై చివరి చూపు చూసుకోవాలని వారు వెళు న్నారు.తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి శివారులోని బ్రిడ్జి సమీపానికి చేరుకోగానే, వెనుక నుంచి అతివేగంగా దూసుకొచ్చిన కారు వీరి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి ఇద్దరూ గాల్లోకి ఎగిరి కిందపడటంతో తలలకు తీవ్ర గాయాలయ్యాయి.రక్తం మడుగులో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు.సమాచారం అందిన వెంటనే తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎస్సై అన్వర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా కన్నీరుమున్నీరైంది. సీపీఐ నాయకుడిగా అందరికీ సుపరిచితుడైన రామచంద్రం మరణ వార్త విన్న పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మృతుడు శ్రీనివాస్ భార్య అవుదూర్తి మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిమ్మాపూర్ ఎల్ఎండి పోలీసులు కేసు నమోదు చేశారు.

## జోగిన్పల్లిలో కత్తి దాడి

### - మహిళకు తీవ్ర గాయాలు

**సూర్య కోరుట్ల**

కోరుట్ల మండలం జోగిన్పల్లి గ్రామంలో పాత కక్షల కారణంగా జరిగిన కత్తి దాడి ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన నల్ల నవీన్ ( 30) అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన ముక్కెర గంగారెడ్డి పై దాడి చేయడానికి ప్రయత్నించిన ఘటన చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం, ఫిబ్రవరి 20 సాయంత్రం సమయంలో గంగారెడ్డి ఒంటరిగా ఉన్న సమయంలో నల్ల నవీన్ అతనిపై చేతులతో దాడి చేశాడు. అనంతరం అతనిని హత్య చేయాలనే ఉద్దేశంతో రాత్రి సుమారు 9 గంటల సమ యంలో ముందుగా తెచ్చుకున్న కత్తితో గంగారెడ్డి ఇంటికి వెళ్లాడు.అయితే గంగారెడ్డి ఇంటిలో లేకపోవడంతో, అక్కడ ఉన్న అతని తల్లి ముక్కెర వెంకటరాజును కత్తితో ఎందుకు వచ్చావని ప్రశ్నించగా, ఆమెపై నల్ల నవీన్ కత్తితో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిలో ఆమె తలకు, ఎడమ చేయికి, ఎడమ కాలుకు తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై గంగారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు నల్ల నవీన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
రాజన్నసిరిసిల్ల
ఆదివారం 22 ఫిబ్రవరి 2026 3

# 12 రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

## - హామీ ఇచ్చి ముఖం చాటేసిన ఎమ్మెల్యే - రైతుల పాదయాత్ర, రోడ్డుపై వంట వార్పు

**సూర్య, ఇల్లంతకుంట**

కాళేశ్వరం11 వ ప్యాకేజ్ ఆర్డి3 ఎల్ ఎం6 కెనాల్ అసంపూర్తి పనుల నిర్మాణం చేపట్టాలని గత 12 రోజులుగా 12 గ్రామాల రైతులు నిరసన తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవ డంలేదని మండలం లోని పెద్ద లింగాపూర్ గ్రామ సమీపంలో కెనాల్ నిర్మాణంచేపట్టాలని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలకు చెందిన రైతులు డిమాండ్ చేశారు. పెద్ద లింగాపూర్ రైతులు చేస్తున్న దీక్ష స్థలానికి తంగళ్లపల్లి మండలం రామన్నపల్లె కు చెందిన రైతులు 200 మంది పంటలు ఎండిపోయి ఉపాధి పనిని



నమ్ముకుని ఉపాధి పనిని పూర్తి చేసుకున్న తర్వాత అవే తట్టాపారలతో పాదయాత్రతో చేరుకొని,రోడ్డుపై వంటలు చేసి వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే, అధికారులు కలిసి మండలం లోని పలు గ్రామాల్లో పర్యటన చేసి కూడా దీక్ష స్థలానికి రాకపోవడం చూస్తుంటే రైతులపై ఎంత చిత్త శుద్ధి వుందో తెలుస్తుందని, గతంలో నిరసన చేపడితే సంబంధిత అధికారులను పంపి మాయమాటలు చెప్పి దీక్ష విరమంపజేసి నట్టు గుర్తు చేశారు. కెనాల్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని త్వరలో పనులు చెప్పాడుతామని చెప్పి ఏడాది గడిచిందన్నారు.రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని,తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు రైతులు వెనకాడబోమని తేగేసి హెచ్చరించారు. ఈసమావేశంలో 12 గ్రామాల పలువురు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# వేసవిలో తాగు నీటి సమస్య రావొద్దు

### - సమ్మర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన సర్పంచ్ చిగురు నరేష్

**సూర్య, ముస్తాబాద్**



మండలంలోని బంధనకల్ గ్రామ ంలో నీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ చిగురు నరేష్ తెలిపారు .శనివారం గ్రామంలో నీటి సమస్య ఉన్న వీధులను పరిశీలించి కొత్త లైన్లకు పైపులైన్స్, లీకేజీలు ఉన్న వాటిని బాగు చేయడం జరిగిం ది.వేసవిలో గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గ్రామ కార్యదర్శి నవ్య, డిలు పావని, ఏఈ దివ్య, కారోబార్ సాయి,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# యువజన సంఘాల పాత్ర చాలా కీలకం

**సూర్య, తంగళ్లపల్లి**



గ్రామాలు అభివృద్ధి జరగాలంటే యువజన సంఘాల పాత్ర చాలా కీలక మని మండేపల్లి సర్పంచ్ గడగోని సాగర్ అన్నారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో శనివారం యువజన సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. గ్రామంలోని యువత చదువుతో పాటు గ్రామ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. యువత సహక రించినప్పుడే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లీ దండ్రులు శ్రద్ధ తీసుకోవాలి

### - రేపాక హై స్కూల్ హెచ్ ఎం. రేవతి

**సూర్య, ఇల్లంతకుంట**



విద్యార్థుల చదువుపట్ల ఉపాధ్యాయుల తోపాటు, ఇళ్లలో పిల్లలపై తల్లి దండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని రేపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదం డ్రులతో, ఉపాధ్యాయుల సమా వేశం జరిగింది.పాఠశాలకు సంబంధించి పలు అంశాలపై, విద్యార్థుల చదువు పట్ల తల్లీ దండ్రులతో చర్చించారు. అనంతరం హెచ్ఎం. రేవతి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని,వారి పట్ల తీసుకోవలసిన బాధ్యత ఎంతైనా వుందన్నారు. పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు మద్య పానం సీసాలు వేయడం తో పాటు, పగలగొట్ట డం జరిగిందని, వాటి వల్ల విద్యార్థులకు ప్రమాదాలు జరిగి గాయలయ్యే పరిస్థితి వుందన్నారు. వారిపై చర్యలు తీసుకునేలా పోలీస్ ల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లీ దండ్రులు పాల్గొన్నారు.

# భద్రతపై విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

### -జిల్లా షీ టీమ్
### - సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
### - బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో అవగాహన

**సూర్య, బోయినపల్లి.**




జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ప్రతి రోజూ విద్యాసంస్థలు, మహిళలు పని చేసే ప్రదేశాలను సంద ర్శిస్తూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవిటీజింగ్, పోక్సో చట్టం, షీ టీమ్ సేవలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈకార్యక్ర మంలో భాగంగా బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభు త్వ పాఠశాల లను షీ టీమ్ బృందం సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించి, వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని , నిందితులపై కఠిన చర్యలు తీసుకుం టామని , ఫిర్యా దుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూ డదని,గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమ ంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కష్టపడితేనే విజయాన్ని సాధిస్తాం

### - ప్రిన్సిపాల్ విజయ రఘునందన్

**సూర్య, సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిత్య జాతీయ పతాకా విష్కరణ 182వ చివరి రోజు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ రఘునందన్ జాతీయ పతాకావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవకాశం మాన్యులకే కాకుండా సామాన్యులకు అందించే టువంటి నిత్య జాతీయ పతాకావిష్కరణ. అభినందనియమని, ప్రతిరోజు విద్యార్థుల చేత జాతీయ పతాకావిష్కరణ చేయించడం ఒక వినూత్న కార్యక్రమమని అన్నారు.రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ జూనియర్ కళాశాల సిరిసిల్ల అని తెలిపారు.ప్రతి విద్యార్థి దేశభక్తి భావాలను పెంచుకోవాలని క్రమశిక్షణతో చదివితే ఎలాంటి ఉద్యోగాలైన సాధించవచ్చని వారు తెలిపారు.విద్యతో పాటు పుస్తక పఠనం చేయాలని ప్రతి విద్యార్థి సెల్ ఫోన్లకు దూరంగా ఉండి,గురువులు చెప్పే విషయాలను పాటించి ఇష్టపడి కష్టపడి చదివితేనే మీ లక్ష్యాన్ని చేరగలుగుతారని అన్నారు.వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు తీసుకొచ్చి కళాశాలకు,తల్లిదండ్రులకు పేరు తీసుకురా వాలన్నారు.థాంక్స్ గివింగ్ డే కార్యక్రమంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అధ్యాపకుల పట్ల తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కళాశాల అధ్యాపకులు శ్రీధర్,పి. ఆంజనేయులు, చంద్రమౌళి, సరోజ,రాజశేఖర్, శ్రీనివాస్,సుజిత,సాగర్,నర్మద,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# కామారెడ్డి ఎమ్మెల్యే 'కాటిపల్లి' పైకాంగ్రెస్ నాయకుల దాడిని ఖండించిన ఇల్లంతకుంట బిజెపి నాయకులు

**సూర్య, ఇల్లంతకుంట**

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని శనివారం ఇల్లంతకుంట మండల బిజెపి నాయకులు తీవ్రం గా ఖండించారు.ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల అవినీతి గురించి బయట పెట్టిన, మాట్లాడిన ఎమ్మెల్యే పైనే దాడికి దిగిన కాంగ్రెస్ నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశమంతటా, తెలంగా ణలో ప్రధాన పాత్ర పోషిస్తున్న భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే పరిస్థితే ఈ విధంగా ఉంటే, సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్ నాయకులు అధికార బల దుర్వినియోగంతో, అవినీతితో, తప్పుడు కేసులతో ప్రజల యొక్క వ్యతిరేకతను మూటగట్టుకున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు అధికార కాంగ్రెస్ పార్టీ తొత్తులుగా మారారని విమర్శలు చేశారు.కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంద న్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బత్తిని సాయి గౌడ్, మేకలమల్లేశం,దేశెట్టి శ్రీనివాస్,మామిడి హరీష్, పాల్గొన్నారు.

# ఓవర్ లోడ్ రాళ్లతో వెళ్తున్న ట్రాక్టర్లు

### - ట్రాలీకి తలుపులు లేకుండా రోడ్లపైకి దూసుకెళ్తున్న ట్రాక్టర్లు
### - ఓవర్‌లోడ్ ట్రాక్టర్లపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలి
### - నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు విధించాలి

**సూర్య,ముస్తాబాద్**



పట్టణ, గ్రామీణ రహదారులపై ఓవర్ లోడ్ రాళ్లతో ట్రాక్టర్లు నిర్లక్ష్యంగా సంచరిస్తున్నాయి. నిర్మాణ పనుల కోసం రాళ్లను తరలించే ట్రాక్టర్లు సామర్థ్యానికి మించి లోడ్ తీసుకుని వేగంగా ప్రయా ణిస్తున్నాయి.ట్రాలీ వెనుక భాగంలో తలుపు లేకపోవడంతో గుంతలు, బ్రేకులు వేయగానే రాళ్లు వెనక్కి జారిపడి రోడ్డుమీద చెల్లాచెదుర వుతున్నా యి. దీంతో వెనుక నుంచి వస్తున్న వాహనదారులు తీవ్ర ప్రమా దాలకు గురవుతున్నారు.బైక్,ఆటో డ్రైవర్లు అకస్మాత్తుగా బ్రేకులు వేయాల్సి రావడ ంతో ప్రమాదాలు తప్పట్లేదు.రవాణా నిబంధనల ప్రకారం వాహనం లో సరుకు సురక్షితంగా కట్టుదిట్టంగా ఉండాలి. కానీ ఈ నియమాలు అమలు లో కనిపించడంలేదు.పోలీసులు,రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి ఓవర్‌లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# దహన సంస్కారాలకు సర్పంచ్ చేయూత

### - ఎన్నికల్లో హామీ-అమలుపరుస్తున్న సర్పంచ్ ఎం.రాజు

**సూర్య, ఇల్లంతకుంట**



మండలకేంద్రమైనఇల్లంతకుంట కు చెందిన కట్ట పోచయ్య అనా రోగ్యం తో మృతి చెందగా, బాధి త కుటుంబానికి దహన సంస్కా రాల నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని శనివారం ఇల్లంతకుంట సర్పంచ్ ఎం.రాజు అందజేసి చేయూ త నిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కక్కటి నెరవేరు స్తున్న సర్పంచ్ రాజును పలువురు అభినందిస్తున్నారు.ఈ కార్య క్రమంలో వార్డు సభ్యులు రాకం సుమన్,మామిడి శ్రీనివాస్, అంతటి శ్రీకాంత్, కూన బోయిన రఘు తదితరులు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

జగిత్యాల

ఆదివారం 22 ఫిబ్రవరి 2026 

# సీనియర్ సిటిజెన్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

## -జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**సూర్య జగిత్యాల అర్బన్**



సీనియర్ సిటిజెన్ల సంక్షేమానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ సంఘాల ప్రతి నిధులు ఆ సంఘాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. అనంతరం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ రూపొందించిన వయో వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం, పెన్షనర్స్ సర్వీస్ రూల్స్ పుస్తకాలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో రూ. కోటి రూపాయలతో తారకరామ నగర్ లో ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశామని, అలాగే జగిత్యాల పట్టణ బై పాస్ రోడ్ లో డే కేర్ సెంటర్ ఏర్పాటు జరిగిందని, అందులో సీనియర్ సిటిజెన్లకు ఉచితంగా అల్పాహారం, వైద్య సేవలు, వినోద కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. హరి అశోక్ కుమార్ వినతి మేరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారంకు ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్ళు తానన్నారు. వయో వృద్ధుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పాటు పడుతున్న సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను, వారి సంఘాల ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాతం, పెన్షనర్ల జిల్లా కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ ఉపాధ్యక్షులు పి. అశోక్ రావు, కోశాధికారి వి. ప్రకాష్ రావు, సంయుక్త కార్యదర్శి ఎం. డి. యాకూబ్, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివా నందం, జగిత్యాల యూనిట్ అధ్యక్షులు బి. రాజేశ్వర్, నాయకులు కొక్కుల ఆంజనేయులు, నాయిని సంజీవ రావు, సత్యనారాయణ, బాలయ్య, కట్ట గంగాదర్, కరుణ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ వేడుకలు

**సూర్య మెట్ పల్లి రూరల్**



మండలంలోని మేడిపల్లి (పడమర) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగాజరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో కవి పరిచయాలతో కూడినటువంటి చిత్రాలను , తెలుగు పదాలు మరియు వ్యాకరణ చిత్రాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనం పై ఉపన్యాస పోటీ, తెలుగు పద్యాలు,పాటల పోటీ మరియు ప్రత్యేక తెలుగు భాష పోటీలను తెలుగు ఉపాధ్యాయులు సొప్పరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మెట్ పల్లి విద్యా ధికారి(ఎం. ఈ.ఓ) మేకల చంద్రశేఖర్ తెలుగు భాష గొప్పతనం పై మాట్లాడారు. మరియు పదవతరగతి విద్యార్థులకు గణితం,భౌతిక శాస్త్ర ప్రత్యేక మెటీరియల్ను అందజేశారు ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారుమరియు తెలుగు క్విజ్ పోటీ లలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ నాగమణి ఉపాధ్యాయులు శ్రీదేవి,పద్మలత, నాగన్న,జ్యోతి, భీమన్న,సొప్పరి శ్రీనివాస్,లక్ష్మీ పాల్గొన్నారు.

## కలెక్టరు ద్వారా అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయుడు రవి

**సూర్య - కథలాపూర్**



మండలంలోని పోసాని పేట ఎం పి యు పి ఎస్ ప్రధానోపాధ్యా యుడు గుండేటి రవి కుమార్ కు శనివారం కలెక్టర్ సత్య ప్రసాద్ అవార్డు అందజేశారు. స్వచ్ ఎవం హరిత్ విద్యాలయ రేటింగ్ 2025 - 26 జిల్లా స్థాయి ర్యాంకింగ్ లో పోసాని పేట పాఠశాలకు గుర్తింపు తెచ్చి, విద్యార్థుల యొక్క స్వచ్ఛత ప్రగతికి చిహ్నంగా నిలిపినందుకు ఆయనకు అవార్డు అందజేసి అభినందించారు. ఈ అవార్డు గ్రామానికి జిల్లాలో మొదటి స్థానంలో నిలిపినందుకు ప్రాడానోపాద్యాయునికి,ఉపాధ్యాయులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## స్పోర్ట్స్ సెంటర్లను యువత వినియోగించుకోవాలి

### - మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



స్పోర్ట్స్ సెంటర్లను యువత వినియోగించుకోవాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని భాగ్యరాజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా "ది స్పోర్ట్స్ ఎరీనా క్రికెట్ బాక్స్" ను మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సమిల్ల వాణీ శ్రీనివాస్ లు ప్రారంభించగా గ్రాండ్ షటిల్ బాక్స్ ను మాజీ జెడ్పి చైర్మన్ దావ వసంత సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక శారీరక ఆరోగ్యం పెంపొందుతుందని,యువత తమకు అందుబాటులో ఉన్న స్పోర్ట్స్ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ పెద్దూరు స్వతంత్ర మహేష్, స్పోర్ట్స్ సెంటర్ నిర్వాహకులు దొండపాటి జనార్ధన్ రెడ్డి సరళ తో పాటు తెలంగాణ రాష్ట్ర బీసీ రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, అనుమల్ల రమేష్, మాజీ కౌన్సిలర్ గాజుల నగేష్, బండి సత్యం, అత్తినేని రాజేంద్రప్రసాద్ ,వేముల సురేందర్, బ్రాహ్మణపల్లి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ నీ మర్యాద పూర్వకంగా కలిసిన సర్పంచ్ లు

**సూర్య సారంగాపూర్**



సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామ సర్పంచ్ కోలపాక రాధ రాజు లు శనివారం జగిత్యాల పట్టణంలోని ఇందిర భవన్ లో మాజీ ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అస్వస్థతకు గురై హైదరాబాద్ నగరంలో ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగా ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం శ్రీ దుబ్బరాజన్న ఆలయ తీర్థ ప్రసాదాలు,క్యాలెండర్ అందించారు. ఈ కకార్యక్రమంలో పెంబట్ల కొలపాక రాధా రాజు, నాగునర్ రుషేంద్ర శంకర్ రెడ్డి, లచ్చుక్క పేట రమా భాస్కర్ తదితరులు ఉన్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యే ను కలిసిన సర్పంచ్ లు

**సూర్య సారంగాపూర్**

సారంగాపూర్ మండలంలోని పెంబట్ల నాగునూరు లచ్చుక్క పేట గ్రామాల సర్పంచ్లు కొలపాక రాధ రాజు,రుషేంద్ర శంకర్ రెడ్డి, రామ భాస్కర్ శని వారం జగిత్యాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగి త్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి దుబ్బ రాజన్న ఆలయ ప్రసాదం అందజేశారు. వారి వెంట మాజీ ఎంపీపీ కోల జమున శ్రీనివాస్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గురునాథ మల్లారెడ్డి, అర్పపల్లి సర్పంచ్ సొల్లు సురేందర్ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడి యువతి మృతి

### - కుటుంబానికి ఆర్థిక సాయం

**సూర్య కొడిమ్యాల**



కొడిమ్యాల మండలం డబ్బు తిమ్మాయ్యపల్లి గ్రామానికి చెందిన కొంపెల్లి విజయ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషాద ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన స్థానిక నాయకుడు ఏలేటి కమలాకర్ రెడ్డి వారు సానుభూతి వ్యక్తం చేసి, కుటుంబానికి ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి ధైర్యం చెప్పి, అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురకంటి ముత్యం రెడ్డి, మధు, సంజీవ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు చేయాలి

### -పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా నేతల డిమాండ్

**సూర్య జగిత్యాల అర్బన్**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్సీ నివేదికను సత్వరమే ప్రకటించి అమలు చేయాలని పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్నాథ్ రెడ్డి లు డిమాండ్ చేశారు. నల్ల శాంత నారాయణ ప్రధానో పాధ్యాయులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొండగట్టు మండల మల్యాల ఉద్యోగ విరమణ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన స్థిరీకరణకు సంబంధించి పిఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి రెండున్నర ఏళ్ళు గడిచినా పిఆర్సీ అమలు చేయక పోవడం, పెండింగ్ లో ఉన్న అయిదు విడతల కరవు భత్యాలను( డి ఏ) సైతం ప్రకటించని కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జి పి ఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్స్, టి ఎస్ జి ఎల్ ఐ, సరెండర్, మెడికల్ బిల్లులను తక్షమే మంజూరు చేయాలని చేయాలని కోరారు. చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షనరీ బెనిఫిట్స్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అనంతరం శాంత సేవలను కొనియాడారు, శాంతని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జయ సింహా రావు, జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్ రాము, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండ శంకర్, పి ఆర్ టి యు టి ఎస్ మండల అధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి, ఆదర్శ పాఠశాల చైర్మన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పేదలకు వరం

**సూర్య పెగడపల్లి**



ఇందిరమ్మ ఇండ్లతో నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరిందని మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, సర్పంచ్ కుంటాల వనజ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నంచర్ల గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారునితోకలిసి చైర్మన్ రాములు గౌడ్ సర్పంచ్ కుంటాల వనజ శ్రీనివాస్ గృహప్రవేశ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదోడి సొంతింటి కల నెరవేరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు గడువు మరో వారం పొడిగింపు

**- ఈ నెల 27 వరకు కొనసాగనున్న కొనుగోళ్లు**

**- ఎమ్మెల్యే విజయరమణ రావు చొరవతో స్పందించిన మంత్రి తుమ్మల**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

పత్తి రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI) నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 20తో ముగియాల్సిన పత్తి కొనుగోలు ప్రక్రియను, మరో వారం రోజుల పాటు అంటే ఈ నెల 27వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దపల్లి నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇంకా పత్తి నిల్వలు ఉండటాన్ని గమనించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు, తక్షణమే రంగంలోకి దిగారు. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో గురు వారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కు ఫోన్ చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు. నిల్వలు ఇంకా పేరు కుపోయి ఉన్నాయని, గడువు పొడి గించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విన్నపంపై సానుకూలంగా స్పందించిన



మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, వెంటనే ఉన్నతాధికారులకు, CCI ప్రతి నిధులకు సూచనలు జారీ చేశారు. దీంతో ప్రభుత్వం కొనుగోలు గడువును పెంచుతూ శనివారం అధికారిక నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, రైతన్న సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## ఇటుక బట్టి ఆకస్మిక తనిఖీ

**సూర్య - పెద్దపల్లి రూరల్**



మండలంలోని రాఘవపూర్ గ్రామంలోని (వి ఎస్ ఆర్ బ్రిక్స్ ) ఇటుక బట్టిలో మౌ లిక సదుపా యాలు మరియు కార్మికుల జీవన విధానం పై జిల్లా సబ్ – సీనియర్ సివిల్ జడ్జీ మరియు జిల్లా న్యాయ సేవ అధికారి వి. భవాని ఆకస్మిక తనిఖీ నిర్వ హించారు. ఈ సందర్భంగా సబ్ – సీనియర్ సివిల్ జడ్జి బట్టి లో పని చేస్తున్న కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికులకు కల్పిస్తున్న వసతు లు, తాగునీరు, విద్యుత్, నివాస ఏర్పాట్లు, కార్మికుల పిల్లల విద్య గురించి, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించారు.అలాగే కార్మికులకు చెల్లిస్తున్న కూలీ వివరాలు, ఉపాధి పరిస్థితులు, పని గంటలు వంటి విష యాలపై సమగ్రంగా ఆరా తీశారు. కార్మికుల సంక్షేమం కోసం అవస రమైన సూచనలు కూడా చేశారు. బ్రీక్స్ యజమానితో త్వరలో పరిశీలన చేస్తాను, అన్ని వసతులను, కార్మికులకు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజయ్య, జిల్లా లేబర్ ఆఫీసర్ హేమలత , పెద్దపల్లి రూరల్ ఎస్సై బి మల్లేష్ , ఆర్ ఐ శ్రీనివాస్, సర్పంచ్ గంట రమేష్ తదితరులు ఉన్నారు.

## సైన్స్ ఎక్స్ పోలో ప్రతిభ కనబరిచిన గీతాంజలి హై స్కూల్ విద్యార్థులు

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో టెక్నో స్పార్క్ 2కే26, జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియంలో భాగంగా వివిధ పాఠశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా గీతాంజలి హై స్కూల్ విద్యార్థులు తయారు చేసినటువంటి "స్మార్ట్ డస్ట్ బిన్ " అనే ప్రయోగానికి మూడవ బహుమతి రావడం జరిగింది. ఈ ప్రయోగంలో పాల్గొన్న విద్యార్థి విద్యార్థులను గీతాంజలి హైస్కూల్ కరెస్పాండెంట్ రేపాల రజిత, అకాడమిక్ డైరెక్టర్ రేపాల రోహిత్ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 లక్షల వ్యయంతో ఫుట్‌పాత్ పనులకు శ్రీకారం చుట్టిన మేయర్ మహంకాళి స్వామి

**సూర్య-గోదావరిఖని**



పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలి లక్ష్మీ నగర్, కళ్యాణ్ నగర్ ప్రాంతాల్లో టి.యు.ఎఫ్.ఐ.డి.సి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం సుమారు రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఫుట్‌పాత్ పనులకు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కళ్యాణ్ నగర్ కూడలిలో భూమిపూజ చేసి పనులను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మేయర్ స్వామి మాట్లాడుతూ నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రతి వార్డులో అవసరమైన పనులను దశలవారీగా చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఫుట్‌పాత్ నిర్మాణం పూర్తయిన తర్వాత పాదచారులకు సౌకర్యం కలగడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమం లో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, కార్పొరేటర్లు గట్ల రమేష్, చిదురాల నాగరాజు, ఎండి.ముస్తాఫా, ధూళికట్ట సతీష్, నాయకులు కజాంపురం రాజేందర్, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నగర అభివృద్ధి దిశగా మున్సిపల్ కార్పొరేషన్ తీసుకుంటున్న చర్యలకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ఈ-స్కూటర్ పథకానికి మైనారిటీ యువత దరఖాస్తు చేసుకోవాలి

**-జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో ఈ-స్కూటర్ పథకానికి అర్హులైన మైనారిటీ నిరుద్యోగ యువత (పురుషులు) మార్చి 1లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు శనివారం తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025-26 సంవత్సరానికి పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఎంపికైన అభ్యర్థుల కు రూ. 1.50 లక్షల విలువైన ఈ-స్కూటర్‌ను 80 శాతం సబ్సిడీతో అందించనున్నారు. అభ్యర్థులు 21--40 సంవత్సరాల మధ్య వయస్సు, 10వ తరగతి ఉత్తీర్ణత, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.5 లక్షలు, పట్టణాల్లో రూ. 2 లక్షలు మించకూడదు.దరఖాస్తులు 01.03.2026 నాటికి https://tgobmms.cgg.gov.in/ పోర్టల్‌లో నమోదు చేయాలి. పూర్తి వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, రూమ్ నెం. 232, IDOC, పెద్దపల్లి ను సంప్రదించాలని తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు

**సూర్య - పెద్దపల్లి రూరల్**




మండలం లోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.లక్ష్మినర్స య్య మాట్లాడుతూ మాతృభాష తోటే సర్వతోముఖాభివృద్ధి సాధించగల మని, మాతృభాష వినియోగంలో విద్యార్థులకు శ్రద్ధ కీలకమని అన్నారు. తెలుగు విభాగాధిపతి కంజర్ల శ్రీలత మాట్లాడుతూ మాతృగర్భంలోనే మనకు సంక్రమించే భాష మాతృభాషని, అమ్మను ప్రేమించినట్టు అమ్మ భాషని ప్రేమించాలని, అప్పుడే మనమనుగడ సానుకూలంగా ముందుకు సాగుతుందని ,అందుకు విద్యార్థులు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించా లని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రధానాచార్యులు డాక్టర్ ఎ సతీష్ కుమార్, డాక్టర్ జి.పురుషోత్తం,అధ్యాపకులుడాక్టర్ ఏ నారాయణ, శ్రీ బి.మురళి , అంజయ్య మరియు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కుటుంబం ఉదారత...రాధమ్మ కళ్లు సజీవం

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం కల వచర్ల గ్రామానికి చెందిన మల్యాల రాధమ్మ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు రాధమ్మ నేత్రా లను దానం చేసి గొప్ప సేవ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్-సెంటనరీ కాలనీ ఆధ్వర్యంలో డైరెక్టర్, మాజీ జెడ్పిటిసి గంట వెంకట రమణారెడ్డి ఆధ్వర్యం లో సదాశయ ఫౌండేషన్ సహకారంతో ల్యాబ్ టెక్నీషియన్ ప్రదీప్ నేత్రాలను సేకరించారు. మల్యాల రాధమ్మ కుమారులు శ్రీనివాస్, గణపతి, రాంశంకర్, కృష్ణమూర్తి మరియు కుటుంబ సభ్యులు తీసుకున్న గొప్ప నిర్ణయాన్ని అందరూ అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గంట వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ "నేత్ర దానం అంటే ఒకరి జీవితంలో వెలుగు నింపడం, మనం లేకపోయిన మన కళ్ల ద్వారా ఇంకొకరు ప్రపం చాన్ని చూడగలుగుతారన్నారు. ప్రతి కుటు ంబం ఈ విషయం గురించి ముందుగానే ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఒర్రె సదయ్య, మాజీ ఉప సర్పంచ్ వేము కన కయ్య, బూరుగు భూమయ్య, కుమారస్వామి లు హాజరై నివాళులు అర్పించారు.

## మహిళలు టైలరింగ్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలి

**-సర్పంచ్ పోలుదాసరి వనిత-సాయికుమార్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



మహిళలు టైలరింగ్ శిక్షణ ను సద్వినియోగం చేసుకో వాలని జూల పల్లి గ్రామ సర్పంచ్ పోలుదాసరి వనిత-సాయి కుమార్ అన్నా రు. జూలపల్లి గ్రామ ంలో రెండో విడత మహిళలకు టైలరింగ్ శిక్షణ ను సర్పంచ్ పోలు దాసరి వనిత సాయి కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఏ పిడి కాళిందిని, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, ఉప సర్పంచ్ గడ్డం రాజమహేందర్, మాజీ ఉప సర్పంచ్ సాయి కుమార్, ఏపీవో పద్మ, వివోఏలు ప్రేమలత, జ్యోతి, రాజేశ్వరి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

# నేడు శంభుస్వామి (శంభుతీర్థం) జాతర

**- 1018 సంవత్సరాల చరిత్ర గల శివకేశవాలయం - క్రీస్తుశకం 1009 నాటి ఒక శాసనం ఈనాటి శివ కేశవాలయం**

**- ప్రతి సంవత్సరం ఫాల్గుణమాస శుద్ధ పంచమి రోజున జాతర - చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు రాక**

**- శివ కేశవ ఆలయ గత చరిత్ర**

**సూర్య చొప్పదండి**

కళ్యాణి చాళుక్యుల సామ్రాజ్యంలో చొప్పద్యాం డిగా విలసిల్లిన ఈనాటి చొప్పదండికి విశేష ప్రాధాన్యత ఉందని ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తున్నది. వీరి కాలంలో చొప్పద్యాండిగా ఉన్న పేరు కాలక్రమేణా చొప్పదండిగా మారింది. చొప్పదండిలో చాళుక్యుల కాలంనాటి శాసనాలు లభించాయి. మేలకుంట సమీపంలో కీ॥శ॥ 922లో చాళుక్య రాజుల్లో అహవ మల్లదేవ బిరుదాంకితుడైన రెండవ తైలపుని కాలానికి చెందిన దుగ్గరాముడు అని అధికారి కూతురయిన అచబ్బె (ఆచవ్వ) పేరిట ఈ శాసనం లభించింది. ఇరువలేండిగా బిరుదున్న సత్యాశ్రమ కళ్యాణి చాళుక్య ప్రభువు కాలంలో దేవకబ్బె అనే ఆమె కీ॥శ॥ 1009లో ఒక శాసనమే ఈనాటి శివకేశవాలయం. ఈ శాసనం దేవకబ్బె రూపొందించింది. ఈ శివకేశవాలయం విశాలమైన ప్రాకారాల మధ్య పెద్ద శిలలతో నిర్మితమై తూర్పు వైపు ముఖం ఉన్నది. గర్భగృహం, అర్థమండపం, ఒకదానినానుకొని మరొకటిగా ఉన్న నిర్మాణాల గర్భగృహంపై మెట్లతో కూడుకొని పిరమిడ్ ఆకారంతో క్రమంగా పైకి సన్నగా గల చాళుక్య శివకేశవ ఆలయాలు కలవు. ప్రాకారము రాతిచే నిర్మించబడి మధ్యలో సొరంగ మార్గముందుట దీని ప్రత్యేకత. దేవాలయమునకు దక్షిణ దిశయందు జనమేజయుని కాలం నాటి యజ్ఞగుండం కలదు. అది పదకొండు గజముల



పొడవు వెడెల్పుతో చతురస్రాకారముగా ఉన్నది. అది దేవాలయ కోనేరుగా ప్రచారమొందింది. దక్షిణ దిశలో వీరభద్రస్వామి ఆలయం, మండపంకు ఎదురుగా సేదతీర్చుకుంటున్న నందీశ్వరుడు కలదు. పూర్వీకుల కథనం ప్రకారం ఇక్కడ శివలింగం



ఇసుకతో చేసినదని వారి కథనం మరియు ఇక్కడి లింగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని వారి నమ్మకం. అలాగే శివకేశవ ఆలయాలు రెండు ఎదురెదురుగా ఉండటం ఇట్టి దేవాలయ ప్రత్యేకత. ఈ ఆలయములో ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాస శుద్ధ పంచమి రోజున శంభుస్వామి జాతర జరుగుతుంది. ఇట్టి జాతరకు ప్రజలు వేలాదిగా వచ్చి స్వామివార్లను దర్శించుకొని తరిస్తారు. కాగా వంశ పారంపర్య అర్చకులు,, వివేకానంద యూత్ క్లబ్ వారి ఆధ్వర్యంలో జాతర కార్యక్రమాలు నిర్వహిస్తారు..

# సూపర్ నేపియర్ గడ్డి"తో కంప్రెస్డ్ బయోగ్యాస్

**- తెలంగాణలో మొట్టమొదటి బయోగ్యాస్ ప్లాంట్**

**- నేడే గంభీరావుపేటలో కంప్రెస్డ్ బయోగ్యాస్ కు భూమి పూజ చేయనున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**- మాజీ ఎమ్మెల్యే, పిసిసి సీనియర్ నాయకులు కటకం మృత్యుంజయం**

**సూర్య గంభీరావుపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిదని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సీనియర్ నాయకులు,కటకం మృత్యుంజయం అన్నారు. 22వ తేదీ ఆదివారం జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మృత్యుంజయం మాట్లాడుతూ.. ఇతర దేశాల నుంచి దిగుమతులను నిలిపివేసి, మన రాష్ట్రంలోనే గ్యాస్ ఉత్పత్తి చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్లాంట్ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. అందులో భాగంగా, సేంద్రీయ పద్ధతుల ద్వారా ఉత్పత్తి కోసం సీబీజీ ని సిఎన్జి కి



అనుసంధానించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వారి ప్రోత్సాహంతో, "బయోస్టాటమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్" అనే కంపెనీ రిజిస్టర్ చేశామన్నారు. ఇలాంటి కంపెనీల్లో పనిచేస్తున్న నిపుణులతో చర్చించిన తర్వాత రోజుకు 10 టన్నుల సామర్థ్యం గల ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు . దీనికి ప్రధాన ముడి పదార్థం "సూపర్ నేపియర్" గడ్డి, ఇది ఒకసారి నాటితే 8 నుండి 10 సంవత్సరాల వరకు ఉంటుందని,. ఈ గడ్డిని ప్రాసెస్ చేస్తే బయోగ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని ఆయన అన్నారు. ఆ కంపెనీ సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజుకు 30 టన్నుల గడ్డి అవసరం. ఆ ప్రయోజనం కోసం రైతులతో చర్చలు జరిగాయని, అందువల్ల, ఈ ప్లాంట్‌ను గంభీరావుపేటలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ తదితరులు హాజరవుతున్నట్లు మృత్యుంజయం తెలిపారు.

# సీనియర్ సిటిజెన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.**

**సూర్య జగిత్యాల**

సీనియర్ సిటిజెన్ల సంక్షేమానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ రూపొందించిన వయో వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం, పెన్షనర్స్ సర్వీస్ రూల్స్ పుస్తకాలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో రూ. కోటి రూపాయలతో తారకరామ నగర్ లో ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశామని, జగిత్యాల పట్టణ బై పాస్ రోడ్ లో డే కేర్ సెంటర్ ఏర్పాటు జరిగిందని, అందులో సీనియర్ సిటిజెన్లకు ఉచితంగా అల్పాహారం, వైద్య సేవలు, వినోద కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. వయో వృద్ధుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పాటు పడుతున్న సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను, వారి సంఘాల ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాతం, పెన్షనర్ల జిల్లా



కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ ఉపాధ్యక్షులు పి.అశోక్ రావు, కోశాధికారి వి. ప్రకాష్ రావు, సంయుక్త కార్యదర్శి ఎం. డి. యాకూబ్, నాయకులు కొక్కుల ఆంజనేయులు, బాలయ్య,కౌన్సిలర్ క్యాదసు నవీన్ , కొలగని సత్యం,బక్కశెట్టి అంజన్న,తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు

**- ప్రజా ప్రభుత్వములో క్రీడలకు పెద్ద పీట**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.**

**- రాష్ట్ర స్థాయి కుంగ్-ఫూ అండ్ కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ**

**సూర్య ధర్మపురి**

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. డ్రాగన్ స్వార్డ్ కుంగ్-ఫూ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 8 నుండి ధర్మపురి పట్టణంలోని అమ్మ గార్డెన్స్ లో జరుగనున్న రాష్ట్రస్థాయి కుంగ్-ఫూ అండ్ కరాటే పోటీల పోస్టర్ ను మంత్రి లక్ష్మణ్ కుమార్ ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని మంత్రి అన్నారు. ఒలంపిక్ లో బంగారు పతాకాలు సాధించే విధంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. ధర్మపురి పట్టణంలో రాష్ట్రస్థాయి క్రీడలు జరుగనుండడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు కస్తూరి ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 700 మందికి పైగా క్రీడకారులు టోర్నమెంట్ లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భాదినేని రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ నూతన పాలక వర్గం కు ఘన సన్మానం

**సూర్య,రాయికల్**



శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన రాయికల్ మున్సిపల్ పాలకవర్గంను ఆలయంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్ మాట్లాడుతూ రాయికల్ పట్టణ అభివృద్ధి కొరకు నూతన కార్యవర్గం అహర్నిశలు కృషి చేస్తూ,మంచి కార్యక్రమాలకు శ్రీ ఆంజనేయ స్వామి అండ దండలు ఉండాలని కోరుకుంటూ వారిని సన్మానించడం జరిగిందని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్,వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి,కౌన్సిలర్లు తోపారపు ప్రశాంతి సురేష్,భూక్య రాకేష్ నాయక్,కూనరపు మానస భూమేష్,వేముల మౌనిక రాము,ఎలిగేటి లతిక అనిల్ కుమార్, పల్లికొండ గంగాధర్,బత్తిని మహేశ్వరి నాగరాజు,మచ్చ గంగా లక్ష్మి,పుర్రె శ్రీధర్, కల్లెడ చిన్నధర్మపురి,ఆలయ కమిటీ సభ్యులు నోముల జ్యోతి రాజేందర్ రాయిళ్ల ప్రభాకర్ కల్లెడ రాజు సందెల గణేష్ నాయకులు బత్తిని చిన్న భూమయ్య బాపురపు నరసయ్య కడకుంట్ల నరేష్ బొమ్మకంటి నవీన్ కాటిపెల్లి రామ్ రెడ్డి దువ్వక రాజరెడ్డి బాపూరపు రాజీవ్ బొద్దుల శివకుమార్ వాసం ప్రసాద్ ఆడెపు రాంప్రసాద్ ఆలయ అర్చకులు సతీష్ శర్మ మరియు ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు

# ఘనంగా అంతర్జాతీయ మాతృబాష దినోత్సవం.

**సూర్య చందుర్తి**

చందుర్తి మండలం అసిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో "అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ను శనివారం రోజున ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భాషకు సంబంధించిన బోధన అభ్యసన సామాగ్రినీ ప్రదర్శించడం జరిగింది. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఎన్. రజిత మాట్లాడుతూ... పిల్లలు ఎక్కువగా అమ్మతోనే మాట్లాడుతారు. అందుకే మొదటగా నేర్చుకునే భాషను మాతృభాష అంటారు. తెలుగు మన మాతృభాష. భాషా ద్వారానే ఒకరికొకరు తమ భావాలను వ్యక్తం చేసుకునే అవకాశం ఉంటుంది. తెలుగును నిర్లక్ష్యం చేయకుండా చదవడం, రాయడం మాట్లాడడం నేర్చుకోవాలి అప్పుడు ఇతర భాషలు సులువుగా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, తిరుమల మరి విద్యార్థులు పాల్గొన్నారు.



# వివిధ ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి

## - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు ఆదేశం - ప్రాజెక్టుల భూసేకరణపై అధికారులతో సమీక్ష

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. భూసేకరణ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఎక్కడ జాప్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు.శనివారం కరీంనగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కరీంనగర్ హుజురాబాద్ ఆర్డీవోలు, భూసేకరణ, ఇరిగేషన్ అధికారులతో జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఇందిరమ్మ వరద కాలువ, మిడ్ మానేరు రిజర్వాయర్, మోతె ప్రాజెక్టు కెనాలు, గౌరవెల్లి రిజర్వాయర్ కెనాల్లు చొక్కా రావు ఎత్తిపోతల పథకం పనులు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అదనపు పనులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియపై పూర్తిస్థాయిలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన పనుల పురోగతి భూ సేకరణ



ఎంతవరకు పూర్తయింది.. అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ పనుల పురోగతి స్పీడ్ అప్ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని వాటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. భూ సేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టి ప్రాజెక్టుల పనులు సజావుగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ విషయంలో జాప్యం ఎక్కడా జరగకుండా త్వరగా చర్యలు తీసుకొని ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన అదనపు పనులు కెనాల్లు నిర్మాణం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని ఆ దిశగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తపెల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా భూసేకరణకు సంబంధించి 58 కోట్లు మంజూరు అయ్యాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మేరకు నిర్వాసితులకు త్వరగా చెక్కులు అందించే ఏర్పాట్లు చేపట్టాలని ఆర్డిఓ లు, అధికారులను ఆదేశించారు. తద్వారా కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు ముందుకు సాగుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్ ప్రకాష్, కరీంనగర్ ఆర్డిఓ కే మహేశ్వర్ హుజురాబాద్ ఆర్డిఓ రమేష్ బాబు ఇరిగేషన్ శాఖ ఈఈలు రఫిక్, సంతు ప్రకాష్, డిఈ ప్రశాంత్ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్‌లో ఎల్ఎండి విద్యార్థినుల ప్రతిభ

**సూర్య తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థినులు గంధం రేణుక, కళ్యాణి రాష్ట్రస్థాయి సీఎం కప్ బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 16 నుంచి 20 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులను శిక్షణనిచ్చిన పీడీ బస్వీలాల్‌తో పాటు రేణుక, కళ్యాణిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్‌లు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## విజన్ హై స్కూల్ లో ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు

**సూర్య కొత్తపల్లి**



కరీంనగర్ రేకుర్తి లోని విజన్ హై స్కూల్ లో ఈరోజు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవశీ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు . ఈ కార్యక్ర మానికి పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ విచ్చేసి విద్యార్థులందరి కీ మాతృభాష గొప్పతనాన్ని వివరించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థుల యొక్క వివిధ రకాల వేషధారణ లు, నాటికలు ,పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదేవిధంగా విద్యార్థిని ,విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి .ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగింది.పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ విద్యార్థిని, విద్యార్థులకు మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సందవేణి వెంకటే , ప్రిన్సిపాల్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థిని విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ

**సూర్య మానకొండూరు**



ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పుర స్కరించు కొని విద్యార్థి ని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ పాటవాలను వెలికి తీసే సదుద్దేశంతో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మానకొండూరు మండలంలోని ఎమ్మా ర్సీ నందు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల లో 9వ తరగతి చదువు తున్న విద్యార్థిని విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది .ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యా శాఖ అధికారి మధుసూదనా చారి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు అందరూ క్రమ శిక్షణ కలిగి ఉన్నత పౌరులుగా ఎదగాలని ,సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొంది చుకోవాలని ఆకాంక్షిస్తూ ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ కు సంబంధించిన ప్రశ్న పత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. మండలం లోని తొమ్మిది పాఠశా ల విద్యార్థిని విద్యార్థులు ఇందు లో పాల్గొనడం జరిగింది అనంతరం మండలం నుండి అత్యధిక సమాన మార్కులు సాధించిన్నారూ అన్నారం నుండి మాతంగి అభిజ్ఞ, ZPHS ఉటూరు నుండి E.శివ సాయి తేజ, TG మీ పోచంపల్లి నుండి అబ్దుల్ రహమాన్ విద్యార్థులను 23-02-2026 సోమవారం రోజున జిల్లా సైన్స్ మ్యూజియం నందు కరీం నగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే టాలెంట్ టెస్ట్ కు ప్రమోట్ చేయడం జరిగింది .ఈకార్యక్రమం లో ఫోరమ్ శీట ఫిజికల్ సైన్స్ భాధ్యులు నాగుల భుజన్ చందర్, గుండా శ్రీనివాస్, నాగుల రాజేష్ కుమార్, నలుమాచు చంద్ర శేఖర్, గైడ్ టీచర్స్ ఎం.మునీరొద్దిన్, దేవలక్ష్మి, సంధ్య, సురేఖ, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




## 1989 నుండి 2026 పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**సూర్య కరీంనగర్**

సెంట్ ఆల్ఫోన్స్ ఫాదర్ టీ . సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో స్కూలు స్థాపించిన సంవత్సరం 1989 బ్యాచ్ నుండి 2026 బ్యాచ్ వరకు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.విద్యార్థుల సమ్మేళ కార్యక్రమంలో 1989 నుండి 2026 వరకు 37 సంవత్సరాల చదువుకున్న విద్యార్థులు పాల్గొని తమ స్కూల్లో గడిచిన పాత జ్ఞాపకాలను అందరితో పంచుకొని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం 1993 - 1994 బ్యాచ్ కు చెందిన 71 మంది విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి స్కూల్ పేరును స్టేట్ ఫస్ట్ ప్లేసులో సాధించామని గర్వంగా చెప్పారు.. అనంతరం ఫాదర్ టి సంతోష్ కుమార్ పూర్వ విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు.ఫాదర్ టి సంతోష్ కుమార్ ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , డాక్టర్ రాజేంద్రప్రసాద్ , పెద్ది మల్లికార్జున్ , కృష్ణ ప్రసాద్ రాజు , పూర్ణచందర్ , ఈగ సంతోష్ , ఎస్ ఎస్ అరుణ్ కుమార్ , డాక్టర్ అనిల్ కుమార్ , సుమన్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం

**సూర్య కొత్తపల్లి, కరీంనగర్ రూరల్**




కరీంనగర్ కేంద్రంలోని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కార్యాలయంలో ఈరోజున జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల మహేందర్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం గ్రామ స్థాయిలో బలోపేతం,నిర్మాణం గురించి మరియు నిమ్నవర్గాల అభి.వృద్ధి కోసం పలుఅంశాల గురించి మాట్లాడడం జరిగింది. రాబోయే రోజుల్లో అనేక కార్యక్రమాలు దళితజాతి శ్రేయస్సు కోసం చేయుటకు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు వంతడుపుల సంపత్ కుమార్ గారు హాజరై సంఘ నిర్మాణం కోసం దిశా నిర్దేశం చేశారు. అలాగే ఇట్టి కార్యక్రమంలో జిల్లా నాయకులు కనకం విద్యాసాగర్, మాడుగుల ఓదేలు, బూత్కూరి కాంత, ఎలుకపెల్లి తిరుపతి, కల్లపల్లి అరవింద్, మరియు జనార్ధన్ పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

**సూర్య కరీంనగర్**



నగరంలోని మంకమ్మ తోటలో ఉన్న పారమిత ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని "స్మృతి సౌరభం" పేరుతో ఘనంగా నిర్వహించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, నైతిక విలువలు, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. పారమితలో విద్యనభ్యసించిన విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవర్చుకున్నారని అభినందించారు.విద్యార్థులు తమ పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు కీర్తి తీసుకురావాలని వారికి మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో సంస్థ డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

**సూర్య చొప్పదండి**



చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 8వ తరగ తి విద్యార్థులు ఇన్చార్జి హెచ్ఎం జలీల్,సాం ఘిక శాస్త్ర ఉపాధ్యాయు లు ముల్కల కుమార్,గోరంటాల పుష్పలత ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు ను సందర్శించారు.బ్యాంకు మేనేజర్ ఎం.అనిల్ అకౌంట్స్ రకాలు-లాభాలు,డిపాజిట్స్ రకాలు-లభించే వడ్డీ,లోన్స్ రకాలు-వాటిపై చెల్లించే ఇంట్రెస్ట్ లపై అవగాహన కల్పించారు. అపరిచితులకు ఓటీపీ,వ్యక్తిగత బ్యాంకు సమాచారాన్ని తెలపకూడదన్నా రు.ప్రాసెసింగ్ ఆఫీసర్ రమణారెడ్డి క్రెడిట్ ఓచర్,డెబిట్ ఓచర్,లోన్ వోచర్,ఆర్టీజీఎస్,నేఫ్ట్ వంటి పలు ప్రొఫార్మాలు నింపే విధానం వివరించా రు.చెక్ బుక్,ఏటీఎం వాడటం వల్ల కలిగే సౌలభ్యాన్ని తెలిపా రు.సోషల్ ఉపాధ్యాయులు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల కుమార్ మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలపై ప్రత్యక్ష అనుభవాలను కల్పించే దుక్కై,విద్యార్థులు ఆన్లైన్ మోసాలకు గురికాకుండా నివారించేందుకై అవగాహన నిమిత్తం విద్యార్థులతో బ్యాంకును సందర్శించామన్నారు.క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో పరిశీలన,పరిశోధన, ప్రయోగాత్మక,వివరణాత్మక శైలి పెంపొందుతుందన్నారు.

## గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**సూర్య చొప్పదండి**



చొప్పదండి మండల కేంద్రానికి చెందిన గీత కార్మి కుడు పోతిగంటి ఎల్లయ్య ఇటీవల తాటి చెట్టు పై నుండి కింద పడి తీవ్ర గాయాలై, కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గౌడ యువజన సంఘం సభ్యులు వారిని పరామర్శించి 5000 రూపాయిలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ యువజన సంఘం అధ్యక్షుడు బొడిగె గంగరాజు, బత్తిని ప్రశాంత్, పూదరి మధు, బోడిగే సాయికృష్ణ , బోడిగే శేఖర్ పాల్గొన్నారు

# పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

మార్చి 14 తేది నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్ష సెంటర్లలో పూర్తి వసతి ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఎస్ ఎస్ సి విధులు నిర్వహించే సూపరింటెండెంట్ లకు డిపార్ట్మెంటల్ అధికారు లకు శిక్షణ కార్యక్రమం శనివారం రోజున ఐ డి వో సి సమావేశ మందిరంలో జిల్లాలోని మండల విద్యాధికారులు(20) కేటాయించబడిన సియస్(68) లు డీఓ(68) లు, కస్టోడియన్లు (8), వాహన ఇంచార్జిలు (20) హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పదవ తరగతి పరీక్షలు ఎలాంటి లోపాలు లేకుండా జరగాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి చరవాణి ల అనుమతి ఇవ్వకూడదని, ప్రతిఒక్కరు ఐడి కార్డు వేసుకోవాలని, పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, కూర్చోవడానికి సరిపడా బెంచీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ప్రశాంత వాతావరణం కల్పించాలని పోలీస్ శాఖకు ఆదేశించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు అప్రమత్తంగా పనిచేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా రవాణా సౌకర్యం, వైద్య సదుపాయాలు అందు బాటులో ఉంచాలని సంబంధిత శాఖలను ఆదే శించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని తెలి పారు. జిల్లా పరీక్షల విభాగం డైరెక్టర్ నరేందర్ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గతంలో ఉన్న నియమాలు నిబంధనలు పాటిస్తూ ప్రస్తుత సంవత్సరానికి టైం టేబుల్ విషయం ఖచ్చితంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని , పరీక్ష కేంద్రాల నిర్వ హణలో గాని , ప్రశ్న పత్రాల నిర్వహణలో గాని వాటి సరఫరా నిర్వహణలో గాని ఎలాంటి నియమాలు పాటించాలో తెలిపారు. హాల్ టికెట్



నెంబర్ విషయంలోగాని , ఓఎంఆర్ షీట్ విషయాలు గానీ నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. పరీక్షల అనంతరం ఓఎంఆర్ షీట్లు గాని , మిగిలిన ప్రశ్న పత్రాలను గాని ఏ విధంగా బట్వాడా చేయాలి అనే విషయాలపట్ల జాగ్రత్తగా వ్యవ హరించాలని తెలిపారు. సంతకాలు ఎవరెవరు ఎక్కడెక్కడ చేయాలి అనే విషయాల మీద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆన్సర్ స్క్రిప్ట్ మీడియంవైజ్, సబ్జెక్టు వైజ్ , సెంటర్ వైజ్ రెడీ చేసుకుని బ్రౌన్ పేపర్ తో ప్యాక్ చేసి అన్ని వివరాలు సరి చూసుకున్నాకే బట్వాడా చేయాలని తెలిపారు. సోషల్ మీడియా విషయంలో అత్యం త జాగ్రత్త ఉండాలని సూచించినారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పర్యవేక్షిం చాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో డిఇఓ రాము, జిల్లా పరీక్షల విభాగం అధికారి నరేం దర్, జిల్లా కోఆర్డినేటర్స్‌లు, మండల విద్యాధికారులు, సియస్‌లు, డీఓలు, కస్టోడియన్లు, వాహన ఇంచార్జిలు జిల్లా కోఆర్డినేటర్స్‌లు పాల్గొన్నారు.

# ప్రజా ఆశీర్వాదంతోనే మున్సిపల్ పాలకవర్గ స్థాపన

## - ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా పాలన సాగించాలి - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

## - వేములవాడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ బాధ్యతలు

**సూర్య, వేములవాడ**

వేములవాడ మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాలకవర్గం పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పాలకవర్గం కు సూచించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలో మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగిరేలా ఆశీర్వాదాలు అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు



తెలిపారు.పట్టణ ప్రజలు మనకు పాస్ మార్కులు ఇచ్చారనీ, రానున్న రోజుల్లో ఫస్ట్ క్లాస్ మార్కులు పొందేలా పనిచేయాలని, ప్రజల మన్ననలు పొందాలనీ కోరారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులతో కలిసి పని చేయాలన్నారు.వేగంగా విస్తరిస్తున్న వేములవాడ పట్టణంలో సకల వసతులు కల్పించాలనీ పేర్కొన్నారు.గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధి కొందరికి కనిపిస్తలేదనీ, వారికి మనం చేస్తున్న అబివృద్ధి వారి కళ్ళకు కనిపించేలా వాడ వాడలా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు.గత ఎన్నికల సమయం లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నా మనీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామనీ గుర్తు చేశారు.ప్రజా ప్రభుత్వంపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలనీ పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారనీ,కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 70 ఏళ్లలో చేయని అప్పును కేసీఆర్ కేవలం 10 ఏళ్లలో చేసి,రాష్ట్రాన్ని దివాళా అయ్యేలా




చేశారన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు.గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలో పెట్టు బడుల వరద పారుతుందన్నారు.రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామనీ, వేములవాడ నుండి 180 కోట్లతో చందుర్తి, రుద్రంగి మీదుగా సిరికొండ వరకు 100 ఫిట్ల రోడ్డు పనులకు నిధులు మంజూరు, హనుమాజీ పేట నుండి అజ్మీరా తండా వరకు 25 కోట్లతో రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయనీ వెల్లడించారు.మన ప్రాంతంలో కక్ష సాధింపు రాజకీయాలకు తావు లేదనీ, ఇంత నియర్ డియర్ ఫ్రెండ్లీ ఎమ్మెల్యే ఎక్కడా కనిపించరనీ స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకు పోతూ మందుకు పోవాలనీ, వేములవాడ పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధికి నూతన పాలక వర్గం పాటు పడుతుందనీ భరోసా ఇచ్చారు.నూతన పాలకవర్గం ప్రజల ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# మక్తపల్లిలో 'వాగేశ్వరి' వైద్య శిబిరం

**సూర్య, తిమ్మాపూర్**

రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం 5వ రోజుకు చేరిన సందర్భంగా మక్తపల్లిలో శ్రీ మాతా డెంటల్ హాస్పిటల్ సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వివేక్ రెడ్డి గ్రామస్తులకు, మున్సిపల్ సిబ్బందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఉజ్వల భవిష్యత్తు కోసం 'కెరీర్ గైడెన్స్' సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఎంబీఏ విభాగం ప్రొఫెసర్ ఈ. హరిప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ నేటి విపరీతమైన పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవాలి, ఉన్నత విద్యలో ఉన్న అవకాశాలు మరియు ఉపాధి రంగంలో రాణించేందుకు కావాల్సిన నైపుణ్యాల గురించి ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణతో కూడిన నిరంతర శ్రమ ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మక్తపల్లి గ్రామ సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్



పెంట చంద్రయ్య, గ్రామ కార్యదర్శి వంశీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్. సాయినాథ్ మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.



# డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు

## - భద్రతా చర్యలు కట్టుదిట్టం, జిల్లా ఎస్పీ. మహేష్ బి. గీతే

**సూర్య గంభీరావుపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పర్య టన దృష్ట్యా గంభీరావుపేటలో కంప్రెస్డ్ బయోగ్యాస్ భూమి పూజ ఏర్పా ట్లను,హెలిప్యాడ్ స్థలాన్ని ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి,అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ అనిల్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**సూర్య ఇబ్రహీంపట్నం**



ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన లక్కం రాజశేఖర్ (45) గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు.మూడు రోజుల క్రితం ఆయన భార్య తన తల్లి ఇంటికి వెళ్లిన నేపథ్యంలో, గురువారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజశేఖర్ ఫ్యాన్‌కు లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. శుక్రవారం ఉదయం వరకు ఇంటి బయటకు రాకపోవడంతో అనుమానం చెందిన మృతుడి అన్న లక్కం శ్రీనివాస్ ఇంటికి వెళ్లి చూడగా ఆయన మృతదేహాన్ని గుర్తించాడు.ఈ ఘటనపై శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

# బతుకు బాట చూపేది ఉపాధ్యాయుడే..

## - 'డైట్'ను ప్రతిభా కేంద్రంగా తీర్చిదిద్దుతాం

## - ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ

**సూర్య, తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ కాలేజీకి రూ. 13.39 కోట్ల వ్యయంతో 'ప్రతిభా కేంద్రం'గా ఉన్నతీకరించే పనులకు మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మరియు జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి శంకుస్థాపన ఘనంగా చేశారు.ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించే ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని కొనియాడారు. "బతుకు దెరువు నేర్పడమే కాకుండా, జీవితానికి భరోసా ఇచ్చే ఆదర్శప్రాయులు ఉపాధ్యాయులే. సమాజానికి అవసరమైన క్రమశిక్షణ గల పౌరులను తయారు చేసే బాధ్యత మీపై ఉంది" అని ఆయన పేర్కొన్నారు.నాణ్యమైన విద్య లేకపోతే సమాజం వెనుకబడిపోవడమే కాకుండా నిరుద్యోగ సమస్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి ఉపాధ్యా యులు ఆంగ్ల భాషలో నైపుణ్యం సాధించి, ఆత్మవిశ్వాసంతో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఎన్నో వృత్తులకు మూలాధారమైన నైపుణ్యాలను పెంపొందించేది కేవలం ఉపాధ్యాయులేనని వారు ఉద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రిన్సిపల్ శ్రీరాం మొండయ్య, మహాత్మా నగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్హోత్ర, టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఈ ఈ కృష్ణకుమార్, ఏఈ ఎస్ డి మక్దుమ్, కాంట్రాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, సంస్థ సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.



# భాష మన సంస్కృతిని బతికిస్తుంది..

**సూర్య కొత్తపల్లి......**

ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ. స్థానిక ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు విభాగం మరియు సాహితీ సోపతి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సాహిత్య రసజ్ఞులకు, విద్యార్థులకు స్ఫూర్తిదా యకంగా నిలిచింది.ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉదయ సాహితీ సంస్థ గౌరవ అధ్యక్షులు దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజం చైతన్యవం తమవుతుందని తెలిపారు. 1952 ఫిబ్రవరి 21న నేటి బంగ్లాదేశ్‌లో మాతృభాష కోసం ఉద్యమించిన విద్యార్థులను కాల్చి చంపిన ఘటనను స్మరించారు. మాతృభాష గొప్పతనాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి 1999లో ఫిబ్రవరి 21ను అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ప్రకటించిందని వివరించారు. మాతృభాషను



ఎవరూ ప్రత్యేకంగా నేర్పరని, అమ్మ ఒడిలోనే అభ్యసిస్తామని, భావాలను స్పష్టంగా వ్యక్తీకరిం చడానికి మాతృభాషే బలమైన సాధనమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కలువకుంట రామకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, "కవిత్వం ద్వారా మనుషుల మధ్య అనుబంధాలు బలపడతాయి. కవిత్వం మానవత్వాన్ని పరిమళింపజేస్తుంది; అంతర్జాతీయ సౌభ్రాతృత్వానికి మార్గం వేస్తుంది" అని అన్నారు. మాతృభాష మన అస్తిత్వానికి ప్రతీక అని, భాషను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని రక్షించుకోవడమేనని పేర్కొన్నారు.అతిథిగా విచ్చేసిన సాహితీ గౌతమి కార్యదర్శి కొత్త అనిల్ మాట్లాడుతూ, నేటి వేగవంతమైన జీవితంలో మారుతున్న సామాజిక పరిస్థితుల మధ్య మాతృభాషకు దూరం కాకూడదని సూచించారు. "మన భాషలో మనం మాట్లాడుతూనే మన సంస్కృతి చిరకాలం నిలుస్తుంది. ఉన్నతమైన ఉద్యోగాలు చేసినా, ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువకూడదు.తెలుగు సహాయాచార్యులు డా. రాపర్తి శ్రీనివాస్ "మరువకూడదేపుడు మాతృభాష" కవితను చదివారు. హిందీ సహాయాచార్యులు కొమురారెడ్డి "గమ్యంలేని గమనమా" వచన కవితను వినిపించారు. డా. చైతన్య, జక్కని తేజస్విని, బోదాసు సంధ్యలు తమ కవితలను ఆవిష్కరించారు. అనంతరం కవిత్వ పఠనంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.కార్యక్రమంలో తెలుగు విభాగ సహాయాచార్యులు డా. ప్రకాష్, డా. ఆర్. శ్రీనివాస్, మెట్టు వెంకటేశ్వర్లు, పి. శంకర్, డా. పాత అశోక్, డా. పుప్పాల చైతన్య, డా. తాటికాయల భోజన్న, చరిత్ర విభాగ సహాయాచార్యులు సుధాకర్, రామకిషన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు చింత శ్రీనివాస్, విక్రమ్‌లు తమ తెలుగు అధ్యాపకుడు, ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆచార్య కలువకుంట రామకృష్ణను గజమాలతో సత్కరించడం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను చేకూర్చింది.

## మాట తప్పని 'మేనమామ'

**- అక్షరాల హామీ అమలు - కౌన్సిలర్ బోనాల సాగరిక - శివ చిత్తశుద్ధి**

**సూర్య, వేములవాడ:4**



వేములవాడ మున్సిపల్ ఎన్నికల హామీని బోనాల సాగరిక –శివ నిలబెట్టుకోవడం విశేషం. మున్సిపల్ ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా వార్డులోని ప్రతి ఇంటి ఆడపిల్ల వివాహానికి రూ. 20,000 "మేనమామ కట్నం" గా అందజేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కాగా, శనివారం జరిగిన వివాహ వేడుకలో వధువుకు నగదును అందజేసి,ఎన్నికల హామీని నిలబెట్టుకొని కార్యరూపం దాల్చారు. బోనాల సాగరిక – శివలుఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడంతో, వారికున్న చిత్తశుద్ధిపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## బి ఆర్ ఎస్ పార్టీ కీ రాజు రాజీనామా

**సూర్య - కథలాపూర్**



బిఆర్ఎస్ పార్టీ కీ రాజీనామా చేసినట్లు బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు, ఆర్ కృష్ణయ్య బిసి సంఘం మండల అధ్యక్షుడు తక్కల్లపల్లి గ్రామానికి చెందిన జిల్లా రాజు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తి గత కారణాల వల్ల పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు,ఆ రాజీనామా పత్రాన్ని బి ఆర్ ఎస్ పార్టీ వేములవాడ నియోజక వర్గ ఇంచార్జి చలిమెడ లక్ష్మి నరసింహా రావు కు పంపినట్లు పేర్కొన్నారు.

## వలస కార్మికుల పిల్లలను గుర్తించి టీకాలు వేయాలి

**- డాక్టర్ సజిదా పర్వీన్**

**సూర్య, హుజురాబాద్**



ఇతర రాష్ట్రాల నుండి వలస వస్తున్న కార్మికుల పిల్లలను గుర్తించి తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సజిదా పర్వీన్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మండలం లోని పలు హైరిస్క్ ప్రాంతాలను ఆమె సందర్శించారు. ఇటుక బట్టీలు, స్టోన్ క్రషర్స్, గ్రైనేట్ పరిశ్రమ, పౌల్ట్రీ ఫార్మ్స్, ఆయిల్ మిల్స్, రైస్ మిల్స్ వంటి పరిశ్రమలలో మధ్యప్రదేశ్, చత్తీస్ ఘుడ్, వంటి ఇతర రాష్ట్రాల నుండి కార్మికులు వలస వచ్చి ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుంటున్న కుటుంబాల్లో 0–16 వయస్సు గల డ్రాప్ అవుట్స్ పిల్లలను గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్య సిబ్బందికి ఆమె సూచించారు.

# ప్రజా ప్రభుత్వం కృషితోనే మానాల-మరిమడ్ల రోడ్డు సహకారం

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి - మానాల-మరిమడ్లకు బీటీ రోడ్డు పనులు ప్రారంభం**

**సూర్య రుద్రంగి**

ప్రజా ప్రభుత్వ సహకారం వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ తీపిరెడ్డి మోహన్ రెడ్డి కృషితోనే మానాల–మరిమడ్ల రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి అన్నారు. శనివారం ఆయన మానాల గిరిజన తండా సర్పంచులు, నాయకులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిలిచిపోయిన మానాల– మరిమడ్ల రోడ్డు పనులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ తీపిరెడ్డి మోహన్ రెడ్డి కృషితోనే ప్రారంభం కావడమే కాకుండా ఉమ్మడి మానాలతో పాటు గ్రామాల తండాలు అభివృద్ధి



జరుగుతుందన్నారు. అభివృద్ధిలో వెనకబడిన మానాల గ్రామంతో పాటు గిరిజన తండాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం రోడ్డు పనులను ప్రారంభించి పూర్తి చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ మానాల తో పాటు గిరిజన తండాల్లో అనేక సంక్షేమ పథకాలు రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టామన్నారు. గత 10 సంవత్సరాలుగా నెరవేరని సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా నెరవేర్చి గిరిజన గ్రామాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి సొంతింటి కల సహకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ అన్నారు. మానాల– మరిమడ్ల రోడ్డు పూర్తి కావడంతో మానాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతుందన్నారు. రోడ్డు పనులు ప్రారంభానికి సహకరించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ తీపిరెడ్డి మోహన్ రెడ్డి లకు మానాల గ్రామం, గిరిజన గ్రామాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భూక్య జవహర్ లాల్, ఇస్లావత్ కిషన్, గూగులోత్ సింధుజ–గంగాధర్, గూగులోత్ మంజుల–రాజు నాయకులు జక్కు మోహన్, జక్కుల లక్ష్మీ నర్సయ్య, రాజు తో పాటు గిరిజన గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు రావలసిందిగా మంత్రి అడ్లూరికి ఆహ్వానం

**సూర్య ధర్మపురి:**

ఈనెల 27 నుండి మార్చి 11 వరకు జరుగనున్న ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కు రావలసిందిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను దేవస్థానం తరపున ఆహ్వానించారు. శనివారం ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్, వేదపండితులు అర్చకులతో కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానం తో పాటు శేష వస్త్రం, స్వామివారి ప్రసాదం అందజేసి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ , ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్, సభ్యులు బొల్లారం పోచయ్య, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**- శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద నూతన ఫౌంటెన్, లైటింగ్ ను ఆవిష్కరించిన మంత్రి**

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నూతన ఫౌంటెన్ ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈనెల 27వ తేది నుంచి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా నూతనంగా ఏర్పాటు చేసిన పౌంటెన్ పాటు లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా పిలుస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈఓ శ్రీనివాస్ తో పాటు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



## అగ్నివీర్ నియామక ర్యాలీకి ముందస్తు ఏర్పాట్లు...యువతకు సువర్ణావకాశం

**సూర్య, సెంటినరీ కాలనీ**




పెద్దపల్లి జిల్లాలో దేశ రక్షణ దళాల్లో చేరాలనుకునే యువతకు మరో మంచి అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఆర్మీ నియామక ర్యాలీ (అగ్నివీర్) త్వరలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడించినట్లు కమాన్‌పూర్ మండల అభివృద్ధి అధికారి సాధినేని ప్రియాంక తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ లోగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. నమోదు చేసిన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి మైదానంలో శారీరక దృఢ పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి 90 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించబడుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత అధ్యయన సామగ్రి, వసతి సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఇలాంటి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిన నేపథ్యాన్ని గుర్తుచేస్తూ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సైన్యంలో చేరే దిశగా ముందడుగు వేయాలని మండల అభివృద్ధి అధికారి సాధినేని ప్రియాంక సూచించారు. దేశ సేవకు తలపడే యువతకు ఇది మార్గదర్శక అవకాశంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## అంగన్వాడీలో ఆరోగ్యలక్ష్మి కమిటీ ఎన్నిక..

**సూర్య బోయినపల్లి..**



మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో ఏ డబ్ల్యూ సి లో నూతనంగా ఆరోగ్యలక్ష్మి కమిటీ ఎన్నిక నిర్వహించారు. కమిటీ చైర్మన్గా సర్పంచ్ సంధ్య, ఉపసర్పంచ్ మారుతి, వివో సంధ్య, లావణ్య, లచే కమిటీ ఏర్పాటు చేశామని అంగన్వాడి సూపర్వైజర్ నిర్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వరలక్ష్మి, అనూజ, తల్లులు, గర్భవతులు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ ఎంపీల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించి తెలంగాణలో భర్తీ చేయనున్నా రాజ్యసభ సీట్లల్లో ఒకటి బీసీలకు ఇవ్వాలని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా వైస్ చైర్మెన్ కొండి సతీష్ డిమాండ్ చేశారు. రాష్టంలో అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన వర్గాల వారికి సరైన న్యాయం చేయాలని, అధికారంలో ఉన్నా లేకున్నా అనునిత్యం కాంగ్రెస్ పార్టీకి నమ్మినబంటులాగా బీసీలకు చేదోడు వాదుడుగా ఉంటును బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, టీజీ ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ కి కేటాయించాలని ఏఐసీసీ పెద్దలను కోరారు. తెలంగాణ నుంచి భర్తీ చేసే రెండు రాజ్యసభ సీట్లలను, తెలంగాణ వారికే కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానంకి విజ్ఞప్తి చేశారు.

# అర్హులైన అందరికీ రెండవ విడత లో ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేస్తాం.

**- ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్.**

**సూర్య జగిత్యాల**

పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం తో నేడు సాకారం అయిందని, అర్హులైన అందరికీ రెండవ విడత లో ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన బొడ్డు మౌనిక సురేష్ ,రాయికల్ మండల కిష్టం పెట్ గ్రామానికి చెందిన పెరుమాండ్ల భూమా గౌడ్ కొడుకు రాజేష్ గౌడ్ సంధ్య లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశం సందర్భంగా దంపతుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల



నియోజకవర్గానికి అత్యధిక ఇండ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కి ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.జగిత్యాల పట్టణం లో 4500 డబల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించామని,పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం తో నేడు సాధ్యం అయిందని అన్నారు. అర్హులైన అందరికీ రెండవ విడత లో ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేస్తాం అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తో గ్రామ గ్రామాన పండగ వాతావరణం నెలకొంది అని అన్నారు.గ్రామంలో 20 ఇండ్ల కు గాను 19 ఇండ్లు నిర్మాణ దశలో ఉండడం ఆనందంగా ఉంది అని అన్నారు. గత బి అర్ ఎస్ ప్రభుత్వం లో గృహ లక్ష్మీ పథకం లో భాగంగా మంజూరైన ప్రొసీడింగ్ లకు సైతం నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి జి.ఓ ఇచ్చారని ,లబ్ధిదారులకు మంచి శుభవార్త అని అన్నారు.ప్రభుత్వంతో పని చేసి జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు బొడ్డు దామోదర్, అంజా గౌడ్, నక్కహరీష్, శేఖర్,మాజీ ఎ ఎం సి డైరెక్టర్ తిరుపతి గౌడ్, ఆది రెడ్డి, సల్ల శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్తయ్య, పురుషోత్తం, సత్తవ్వ,రాము,చిరుత మహేశ్,మంచాల మల్లేశం,బొడ్డు రత్నాకర్,పొన్నాల మధుసూదన్, రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సూర్య కొడిమ్యాల**

కొడిమ్యాల: తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం పథకాల కింద 2025--26 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా 01-03-2026 రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు సమర్పించిన తరువాత అవసరమైన పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

1. ముస్లిం వర్గానికి వడ్డీ రహిత రుణాలు ఢ సబ్సిడీ పథకం:
ఈ పథకం కింద రూ.60,000 (సబ్సిడీ రూ.50,000 ం లబ్ధిదారుడి వాటా రూ.10,000) వరకు రుణం మంజూరు చేయబడుతుంది. మొత్తం రుణంపై 100% సబ్సిడీ అందజేయబడుతుంది.

అర్హతలు:
మైనారిటీ వర్గానికి చెందినవారు కావాలి
ఆదార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలి
వయస్సు 21 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి
పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలి
గత 5 సంవత్సరాలలో మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణం పొందకూడదు

2. మైనారిటీ యువతకు ఈ-స్కూటర్ పథకం (పైలట్ ప్రాజెక్ట్):
ఈ పథకం కింద రూ.1.50 లక్షల వరకు 80% సబ్సిడీ (రూ.1.20 లక్షలు) మరియు 20% లబ్ధిదారుడి వాటాతో ఈ-స్కూటర్ అందజేయబడుతుంది.

అర్హతలు:
నాన్ ముస్లిం మైనారిటీ వర్గాలకు మాత్రమే వర్తింపు
ఆదార్ కార్డు, రేషన్ కార్డు తప్పనిసరి
వయస్సు 21 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలి
పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలి
కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలు మించకూడదు
గత 5 సంవత్సరాలలో మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణం పొందకూడదు
కనీస విద్యార్హత ూాజ పాస్ (డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి)
అర్హులైన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూచించారు.

# శిక్షణకు సర్పంచులు ... రామగిరి మండలం నుంచి 15 గ్రామాల సర్పంచులు హాజరు

**సూర్య సెంటినరీ కాలనీ**

గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సర్పంచులకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి రామగిరి మండలం నుంచి 15 గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమం పెద్దపల్లి మదర్ థెరిసా కాలేజ్ లో ప్రాంగణంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీపీఓ వీర బుచ్చయ్య, డిఎల్ పిఓ మారు పట్ల కొమురయ్య, బండి దేవికదేవి, ఉపాధి ఎపిడి కొమ్మెర సత్యనారాయణలు మాట్లాడుతూ, గ్రామ పాలనలో పారదర్శకత, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, గ్రామ సభల నిర్వహణ, నిధుల వినియోగం, హరితహారం, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామ స్థాయి రికార్డుల నిర్వహణ వంటి కీలక అంశాలపై సర్పంచులకు సమగ్రంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచుల



బాధ్యతలు, అధికారాలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, సామాజిక పర్యవేక్షణ వంటి అంశాలపై నిపుణులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయో గించి గ్రామాల అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించడం వంటి అంశాలపై కూడా మార్గదర్శకాలు ఇవ్వబడుతు న్నాయి. ఈ శిక్షణ ద్వారా గ్రామ పాలనలో నాణ్యత పెరుగుతుందని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సర్పంచులు సన్నద్ధం అవుతారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శిక్షణలో అనుభవాలు పంచుకునే కార్యక్రమాలు, చర్చలు, ప్రాయోగిక తరగతులు కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పల్లె ప్రతిమ-పివిరావు(రత్నాపూర్), కొండవేన దివ్య-సుధాకర్(నాగేపల్లి), రేండ్ల శారద-కుమారస్వామి(కల్వచర్ల), కొంద మంజుల-శ్రీనివాస్(చందనాపూర్), మంథని చంటి(బేగంపేట), ఇల్లందుల సంజీవ్(ఆదివారంపేట), చిందం మహేష్(పన్నూరు) , సుంకరి మహేందర్(ముస్త్యాల), వనం రామ్ చందర్ రావు(లద్నాపూర్), పుల్లెల భాగ్యలక్ష్మి-కొమురయ్య(రాజాపూర్), వీరగోని రమాదేవి -శ్రీనివాస్(లొంకకేసారం),రొడ్డ మౌనిక-కుమార్(నవాబుపేట), ముస్కుల నరేందర్ రెడ్డి(సుందిళ్ల), తాండ్ర యమున-శ్రీనివాస్(జల్లారం), కన్నూరి రవీందర్(బుధవారంపేట), తదితరులు పాల్గొన్నారు.

## పైడిమడుగు ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్

**సూర్య కోరుట్ల**



కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదల, ఆరోగ్యం, వైద్యం, పోషకాహారం, క్రమశిక్షణ అంశాలపై తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి కృషి చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు.గ్రామాభివృద్ధిలో ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దేశ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మోకెన్ ఇండియా కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రను ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బడుగు భూమేశ్వర్ , ప్రధాన ఉపాధ్యాయులు నల్ల ప్రభాకర్ , ఆకువత్తని నిరంజన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకలకు హాజరైన వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్

**సూర్య కొత్తపల్లి కరీంనగర్ రూరల్**



చొప్పదండి నియోజకవర్గం లోని పలు వివాహ కార్యక్రమాలకు తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.
ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**సూర్య రాయికల్**

మండలం లోని మూటపల్లి గ్రామానికి చెందిన ఇమ్మనేని కరుణాకర్ రావు కళాదర్ రావు తండ్రి కిషన్ రావు మరణించగా,వారి చిత్ర పటానికి పూలు సమర్పించి,వారి కుటుంబ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పరామర్శించారు. వీరి వెంట వెంకటేశ్వర రావు,శేఖర్ రెడ్డి,సర్పంచ్ కీర్తన రమేష్,తిరుపతి,నాగరాజు,పవన్,నాసిర్,రఘు, రాజ్ కుమార్,మాజీ సర్పంచ్ నర్సయ్య తదితరులు ఉన్నారు.



## ఐటియుసి యూనియన్ ఓసీపీ-1 సిహెచ్ పి ఫిట్ కమిటీ ఎన్నిక

**సూర్య సెంటినరీ కాలనీ**



సెంటినరీ కాలనీ లోని ఏఐటియుసి యూనియన్ కార్యాలయంలో ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-1 ప్రాజెక్ట్ సిహెచ్ పి ఫిట్ కమిటీ ని ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్.సి.రెడ్డి ఆధ్వర్యంలో నియమించారు. ఫిట్ సెక్రటరీ గంధం శ్రీనివాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గా ఆర్. శ్రీనివాస్, అడ్వైజర్లు గా మనిరాజు, సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.రాములు, మురళి, సిద్ద లింగయ్య, కృష్ణ, రిలే-ఏ సెక్రటరీగా పి. సుధాకర్, రిలే-బి సెక్రెటరీగా కె.రమేష్, రిలే-సి సెక్రటరీ గా కృష్ణ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటరీ జూపాక రామచందర్, ఓసీపీ-1 వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ ఎన్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేటలో దోమల మందును పిచికారి చేయించిన సర్పంచ్

**సూర్య ఇల్లందకుంట**



ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ బక్కతట్ల లక్ష్మి రవీందర్ గ్రామపంచాయతీ సిబ్బందిచే దోమల మందును పిచికారి చేయించారు. దోమల వల్ల గ్రామ ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలనే సదుద్దేశంతో దోమల మందును వాడ వాడల పిచికారి చేయించామన్నారు. అంతేకాకుండా ప్రతి మంగళ శుక్రవారాలలో మండల ఆరోగ్య సిబ్బంది సహకారంతో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా పాటిస్తున్నామని అన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యమే తమకు ముఖ్యమని, అందుకోసం గ్రామ ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బక్కతట్ల లక్ష్మి రవీందర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- సర్పంచ్ మెకినపల్లి గోపాల్**

**సూర్య పెగడపల్లి**



ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మోకినపల్లి గోపాల్ పేర్కొన్నారు. మండలంలోని వెంగళాయిపేట గ్రామంలో శనివారం మహాలక్ష్మి దంత వైద్యశాల పెగడపల్లి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ జీవన విధానంలో ప్రతి మనిషికి ఆహారం తీసుకునే విషయంలో దంతాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరు దంతాల రక్షణలో పలు జాగ్రత్తలు వహించాలన్నారు. నిపుణులైన దంత వైద్యులచే ఉచిత సేవలు అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి దంత వైద్యశాల వైద్యులు పూర్ణచందర్, చంద్రశేఖర్,, ప్రశాంత్, నాయకులు చిందం తిరుపతి, శ్రీరామ్ నరసయ్య. తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల పాలనలో అభివృద్ధిపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

## - ప్రజా ప్రభుత్వంలో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు - మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్

**సూర్య, వేములవాడ:**



పదేళ్ల పాలనలో వేములవాడ అభివృద్ధిపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం వహించిందని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయనిమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ అన్నారు.వేములవాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక, ఉనికి కోసం పాకులాడుతున్న బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదమని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తీవ్రంగా ఖండించారు.ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిన ఆ పార్టీ నాయకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న రాజకీయం పట్ల ప్రజలు విసుగు చెందారని ఆయన ధ్వజమెత్తారు.దళితుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని, పదేళ్ల కాలంలో దళితులకు చేసిందేమిటనీ బీఆర్ఎస్ నాయకులనునిలదీశారు. నిర్మించిన దళిత గడపల నాణ్యత ఎంత అని, దీనిపై రాజన్న గుడి ముందే బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి, ఫోటోలకు ఫోజులిచ్చి మాయమయ్యే నాయకులను వేములవాడ ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, అందుకే మొన్నటి ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితం చేశారని గుర్తు చేశారు.పదేళ్ల నిర్లక్ష్యానికి గురైన రోడ్లు, బ్రిడ్జులు, డ్రైనేజీ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తోందని, ప్రజల్లో వస్తున్న మార్పే అభివృద్ధికి నిదర్శనమని రాకేష్ పేర్కొన్నారు.అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే మీకు సరైన బుద్ధి చెబుతారని, మాటలతో రాద్ధాంతాలు చేయడం కాదు, అభివృద్ధి చేసే దమ్ముంటే నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

## ప్రభుత్వ పాఠశాల బలోపేతమే లక్ష్యం

### - సర్పంచ్ సంధ్య శ్రీనివాస్ రావు

**సూర్య, తిమ్మాపూర్**



ప్రభుత్వ పాఠశాల బలోపేతంతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నుస్తులాపూర్ సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం నుస్తులాపూర్, గుండ్లచెరుపల్లి పాఠశాలల్లో జరిగిన 'తల్లిదండ్రుల సమావేశం'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచ్, మౌలిక సదుపాయాలు మరియు విద్యాబోధనపై తల్లిదండ్రులతో చర్చించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు ఉన్నాయని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాలల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య శ్రీనివాస్ రావుతో పాటు రామకృష్ణ కాలనీ సర్పంచ్ గుజ్జులు శ్వేత ప్రణీత్ రెడ్డి, వార్డు సభ్యులు స్వరూప కొండయ్య, నష్మా నౌషీన్ నిసార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోడ్డుపై "పోగొట్టుకున్న (డబ్బులు)"50,000 వేలు..

### "బాధితులు" సంప్రదించాలని యువకుల వేడుకోలు..

**సూర్య, రామడుగు**

రామడుగు మండల కేంద్రంలో శనివారం బస్టాండ్ లో ప్రధాన రహదారిపై 50 వేల రూపాయలు గుర్తుతెలియని వ్యక్తుల నుండి ప్రధాన రోడ్డుపై పడిపోయాయి.. దీంతో ఆ సమయంలో రామడుగు మండల కేంద్రానికి చెందిన నమిలకొండ ప్రభాకర్ నాగి సాగర్ ఎడవెల్లి సాగర్ అనే యువకులు పోగొట్టుకున్న డబ్బులను చూశారు. అనంతరం దొరికిన 50 వేల రూపాయల విషయం పోగొట్టకున్నవారు సంప్రదించండి అంటూ రామడుగు మండల కేంద్రానికి చెందిన వాట్సప్ గ్రూపులలో సమాచారాన్ని చేరదీశారు. కానీ రాత్రి ఎవరు కూడా స్పందించలేదు. పోగొట్టుకున్న బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో గాని రామడుగు బస్టాండ్ లో ఉన్న కిరాణం లో బొడ్ల శ్రీధర్ ను సంప్రదించాలని వారు తెలిపారు.

## తిరుమలాపూర్ మాజీ సర్పంచ్ "కట్ల శంకర్ రెడ్డి" మృతి.

### - "32 ఏళ్లు"గ్రామానికి సర్పంచిగా "విశేష సేవలు".

### - విషాదంలో తిరుమలాపూర్..

**సూర్య, రామడుగు**



రామడుగు మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కట్ల శంకర్ రెడ్డి శనివారం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కట్ల శంకర్ రెడ్డి తిరుమలాపూర్ గ్రామంలో 1971 నుండి 1995 వరకు వరుసగా 25 ఏళ్లు గ్రామ సర్పంచిగా కొనసాగారు. మళ్లీ 2001 నుండి 2006 వరకు ఏడేళ్లు గ్రామ సర్పంచ్ గా విశేషంగా సేవలు అందించారు. మొత్తం 32 ఏళ్లు గ్రామ సర్పంచ్ గా విశేష సేవలు అందించి గ్రామ ప్రజల నుండి మన్ననలు పొందారు. గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులుగ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.



## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

### - సర్పంచ్ అప్పాల నాగభూషణం

**సూర్య, కోనరావుపేట**

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ అప్పాల నాగభూషణం అన్నారు.కోనరావుపేట మండలం నాగారం లోని జడ్పీ హై స్కూల్లో శనివారం నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పదో తరగతి విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే విజయం సాధించడం సులభమని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని, అందరూ కలిసి కృషి చేస్తే మంచి ఫలితాలు సాధ్యమని అన్నారు. విద్యార్థులకు ఐడెంటిటీ కార్డ్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేశెట్టి మల్లేశం,ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ నిర్మాణలను నిలిపివేయాలి

### - ఆర్డీవో వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు

**సూర్య, కోనరావుపేట(01)**

కోనరావుపేట మండలం గోవిందరావుపేట గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వం గ్రామపంచాయతీ అవసరాల కోసం కేటాయించిన రెండు ఎకరాల భూమిలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని లచ్చపేట తండా ప్రజలు ఆరోపించారు. ఆ స్థలంలో ఇప్పటికే జీపీ భవనం నిర్మించగా, మహిళా సంఘ భవనం పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో పాఠశాల, ఆరోగ్య కేంద్రం వంటి ప్రభుత్వ భవనాలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.అయితే అదే భూమిలో కొందరు గుడి నిర్మాణం చేపట్టడంతో ఆందోళన వ్యక్తమైంది. ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన స్థలంలో ప్రైవేట్ లేదా మతపరమైన నిర్మాణాలు నిలిపివేయాలని కోరుతూ వేములవాడ ఆర్డీఓకు లచ్చపేట తండా ప్రజలు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ భూమిని రక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు.



## నష్టపరిహారం చెల్లించే వరకు భూములు ఇవ్వం

### - లక్కారంలో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసితుల ధర్నా

**సూర్య, ముత్తారం**



ముత్తారం మండలం లక్కారం గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూ నిర్వాసితుల ధర్నా కొనసాగుతోంది. తమకు సరైన నష్టపరిహారం చెల్లించే వరకు భూములను వదిలిపెట్టే ప్రసక్తే లేదని నిర్వాసితులు తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. సంబంధిత ప్రభుత్వ అధికారులు, నేషనల్ హైవే నిర్వాహకులు తూతూ మంత్రంగా సర్వేలు చేస్తూ, మమ్ములను నమ్మించి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సర్వేలతో కాలయాపన చేయడమే తప్ప, నష్టపరిహారం విషయంలో స్పష్టత ఇవ్వడం లేదని వారు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయమైన పరిహారం అందించాలని, అప్పటి వరకు పోరాటం ఆపేది లేదని ధర్నాలో పాల్గొన్న రైతులు, నిర్వాసితులు స్పష్టం చేశారు.

## ఏఐడీఏసీ జిల్లా అధ్యక్షుడిగా గౌరిశెట్టి రాజయ్య నియామకం

**సూర్య, ముత్తారం**



ఆల్ ఇండియా దళిత్ యాక్షన్ కమిటీ (ఏఐడీఏసీ) జిల్లా అధ్యక్షుడిగా ముత్తారం మండలం సర్వారం గ్రామానికి చెందిన గౌరిశెట్టి రాజయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రత్నం శైలేందర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిన్న రాము, రాష్ట్ర అధ్యక్షులు రత్నం శైలేందర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో వెనుకబడిన కులాలకు, ఇప్పటివరకు రిజర్వేషన్ ఫలాలు అందని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## పేదల గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యమే ఇందిరమ్మ ఇళ్ల పథకం

### - ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సూర్య - కథలాపూర్**



రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకంతో అనేక కుటుంబాల సొంతింటి కల నిజమవుతుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఊటుపల్లిలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో అనేక కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతుందని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు పాల లక్ష్మి, న్యావనంది శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజీమ్, నాగరాజు, వేగ్యారపు శ్రీహరి, వాకిటి రాజ రెడ్డి, బైర మల్లేష్,జవ్వాజి రవి ,పాల నవీన్, ముదాం శేఖర్,ఆకుల శంకర్ తదితరులు ఉన్నారు.

## సీఎం కప్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన నల్లవెల్లి ఆనంది

**సూర్య, సెంటినరీ కాలనీ**




హన్మకొండ జేఎన్ఎస్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో కమాన్పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది బంగారు పతకం సాధించారు. 18 సంవత్సరాల విభాగంలోని 400 మీటర్స్ రాష్ట్రస్థాయి బంగారు పతకంను నల్లవెల్లి ఆనంది సాధించింది. కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి శంకర్-భారతిల రెండో కూతురు ఆనంది కమాన్ పూర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ సందర్భంగా ఆనందిని కోచ్ సుబ్బారావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్, పెద్దపల్లి డిఎస్ వై సురేష్, పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య, కమాన్ పూర్ ఎంఈఓ విజయ్ కుమార్ గౌడ్, పిఈటిలు జావేద్, రేణుక, విష్ణు, ప్రణయ్, కొమురయ్య లు అభినందించారు.